

నరసరావుపేట మున్సిపాల్టీలో ఐదేళ్లుగా నిర్మాణంలో ఓవర్‌హెడ్ ట్యాంక్

అమల్లోకి.. అమృత్ 2.0

అమృత్ పనులకు వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టిన గ్రహణం వీడింది. అమృత్ 2.0తో తిరిగి అమృత్ లక్ష్యాలను సాధించనున్నారు. గత వైసీపీ పాలనలో మున్సిపాల్టీల్లో ఎక్కడికక్కడ నిలిచిపోయిన అమృత్ పనులు తిరిగి పట్టాలెక్కనున్నాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం పురపాలక సంఘాల్లోని ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు, మెరుగైన మురుగునీటి పారుదల వ్యవస్థలను అందించాలని లక్ష్యంగా అమృత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే వైసీపీ హయాంలో నిధుల లేమితో ఆయా పనులు పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమృత్ పథకంపై సమీక్షించింది. గతంలో నిలిచిపోయిన పనుల పూర్తి చేయడంతో పాటు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీ ల్లో తాగునీటి పథకాలు, బలహీనవర్గాల కాలనీల్లో ఇళ్లకు కుళాయి కనెక్షన్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించింది. వీటికి కేంద్రం నుంచి ఆమోదం రావడంతో మున్సిపాలిటీలకు మహర్దశ పట్టింది. త్వరలో ఆయా పనులు ప్రారంభించను న్నట్లు సమాచారం.

- గ్రహణం వీడి.. మున్సిపాల్టీలకు మహర్దశ
- తాగునీరు, పారిశుధ్యం మెరుగునకు ప్రణాళికలు
- బలహీనవర్గాల కాలనీల్లో నీటి సరఫరాకు ప్రాధాన్యం
- వైసీపీ హయాంలో నిలిచిన పనుల పూర్తికి చర్యలు
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు రూ.513.58 కోట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పుర ప్రజల తాగునీటి, మురుగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ పథకం తిరిగి పట్టాలెక్కనున్నది. అమృత్ పథకానికి వైసీపీ హయాంలో పట్టిన గ్రహణం వీడనున్నది. అమృత్ పనులను తిరిగి ప్రారంభించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. తాగునీరు, పారిశుధ్యం మెరుగుదలతో ప్రజలకు మెరుగైన ఆరోగ్యం కల్పించాలన్న అమృత్ పథకం లక్ష్యానికి అనుగుణంగా ప్రతిపాదనలను తయారు చేశారు. అమృత్ 2.0 పథకం కింద పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీలలో రూ.513.58 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. మురుగునీటిశుద్ధి ప్లాంట్లు, నీటి సరఫరా కోసం ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, తాగునీటి సరఫరాకు పైపులైన్లు, తాగునీటి నిల్వ చెరువుల అభివృద్ధి, పేదల గృహాలకు కుళాయి కనెక్షన్లు తదితర పనులు చేపట్టనున్నారు. ప్రతి మున్సిపాల్టీలో మురుగునీటిని శుద్ధి చేసి ఆ నీటిని ఇతర అవసరాలకు వినియోగించాలన్నది అమృత్ ప్రధాన లక్ష్యం. అమృత్ పనులు పూర్తయితే పట్టణాల్లో తాగునీరు, మురుగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనున్నది.

అమృత్ తొలివిడత పనులు ఇలా..

చిలకలూరిపేట, నరసరావుపేట, తెనాలి మున్సిపాల్టీల్లో అమృత్ తొలివిడత కింద 2015, 2016 ఆర్థిక సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో ఆయా మున్సిపాలిటీలలో రక్షిత మంచి నీటి పథకాల విస్తరణ, మురుగునీటి వ్యవస్థ అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనులు ఇంకా పూర్తి కాలేదు. నరసరావుపేటలో రూ.13.53 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టగా రూ.5.08 కోట్లతో పైపులైన్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. తాగునీటి కుళాయిలు, నీటి సరఫరా పైపులైన్, ఓవర్ హెడ్ ట్యాంకు పనులు సాగదీస్తునే ఉన్నారు. తెనాలిలో రూ.9.09 కోట్లతో చేపట్టిన పనులు ఇంకా పూర్తి కాలేదు. 24,329 కుళాయి కనెక్షన్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 10,873 కనెక్షన్లు మాత్రమే ఇచ్చారు. నీటి పంపిణీ పైపులైన్ల పనులు పూర్తయాయి. చిలకలూరిపేటలో రూ.149.92 కోట్ల పనులు చేపట్టగా నిధుల కొరతతో చాలావరకు పనులు నిలిచిపోయాయి. రూ.7.70 కోట్లతో 4975 కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్న లక్ష్యం నెరవెరలేదు. పంపింగ్ మెయిన్, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు, తదితర తాగునీటి పథకం పనులు పూర్తి చేయలేక పోయారు. రూ.132.11 కోట్లతో సాగర్ ప్రధాన కాల్వ నుంచి పట్టణానికి నీటి సరఫరాకు పైపులైన్ నిర్మాణాన్ని చేపట్టగా అవి 37 శాతమే పూర్తయ్యాయి. తాగునీటి విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో చిలకలూరిపేట ప్రజలు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. మురుగునీటి వ్యవస్థ అభివృద్ధిలో భాగంగా రూ.10.10 కోట్లతో 5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో చేపట్టిన ఎస్‌టీపీ పనులు కూడా నిలిచిపోయాయి. మున్సిపల్ వాటా చెల్లించే పరిస్థితి లేకపోవడంతో మున్సిపల్ ఆస్తులు తనఖా పెట్టి రూ.43 కోట్లు ఏపీయూఎఫ్ఐడీసీ నుంచి రుణం తీసుకున్నారు.

పల్నాడులో రూ.275.55 కోట్లతో పనులు

పల్నాడు జిల్లాలోని మున్సిపాల్టీల్లో రూ.182.42 కోట్ల వ్యయంతో తాగు నీటి పథకాల విస్తరణ, రూ.93.13 కోట్లతో మురుగునీటి వ్యవస్థ అభివృద్ధి చేసేందుకు అంచనాలను రూపొందించారు. గురజాల నగర పంచాయతీలో రూ.28.28 కోట్లతో తాగునీటి పథకాన్ని విస్తరించనున్నారు. మాచర్ల మున్సిపాల్టీలో రూ.32.30 కోట్లతో తాగు నీటి పథకం అభివృద్ధి చేయనున్నారు. పిడుగురాళ్ల మున్సిపాల్టీలో రూ.20.96 కోట్లు, దాచేపల్లి నగర పంచాయతీలో రూ.24.08 కోట్లు, వినుకొండ మున్సిపాల్టీలో 25.80 కోట్లు, చిలకలూరిపేట మున్సిపాల్టీలో రూ.37.40 కోట్ల వ్యయంతో తాగునీటి పథకాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు. చిలకలూరిపేట మున్సిపాల్టీ లో మురుగునీటి సమస్యల పరిష్కారానికి రూ.69.53 కోట్లతో మురుగునీటి శుద్ధిప్లాంట్ నిర్మించాలని నిర్ణయించారు. రూ.23.60 కోట్లతో నరసరావు పేటలో ప్రస్తుతం అమల్లో ఉన్న భూగర్భ డ్రెయినేజి పథకం విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేశారు.

గుంటూరు జిల్లాకు రూ.157.95 కోట్లు

గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు నగర పాలక సంస్థ, పొన్నూరు, తెనాలి మున్సిపాలిటీలకు 157.95 కోట్లతో అమృత్ 2.0 పనులు చేయనున్నారు. తాగునీటి పథకాల అభివృద్ధి రూ.47.14 కోట్లు, మురుగునీటి సమస్యల పరిష్కారానికి రూ.110.81 కోట్లు వెచ్చించేందుకు ప్రణాళికలు రూపొందించారు. గుంటూరు కార్పొరేషన్‌లో రూ.27.21 కోట్ల వ్యయంతో బలహీన వర్గాల కాలనీలకు తాగునీటి పథకాన్ని విస్తరించనున్నారు. పొన్నూరు పురపాలక సంఘంలో రూ.9.90 కోట్లతో తాగునీటి పథకం విస్తరణ, రూ.7.80 కోట్లతో బలహీన వర్గాల కాలనీలకు తాగునీటి వసతి కల్పించనున్నారు. తెనాలిలో రూ.2.23 కోట్లతో పేదల ఇళ్లకు కళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. మురుగునీటి వ్యవస్థ అభివృద్ధిలో భాగంగా మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి రూ.35.10 కోట్లతో అంచనాలు తయారు చేశారు.

బాపట్ల జిల్లాలో రూ.80.08 కోట్లు వ్యయం

బాపట్ల జిల్లాలో నాలుగు మున్సిపాల్టీలకు రూ.80.08 కోట్లు కేటాయించారు. అద్దంకి మున్సిపాల్టీలో బలహీన వర్గాలు నివసించే కాలనీలకు తాగునీటి సరఫరా వ్యవస్థ అభివృద్ధికి రూ.4.82 కోట్లు కేటాయించారు. తాగునీటి పథకాలకి చీరాలకు రూ.23.82 కోట్లు, బాపట్లకు రూ.15 కోట్లు కేటాయించారు. రూ.5.24 కోట్లతో బాపట్లలోని బలహీనవర్గాల కాలనీలకు తాగునీటిని సరఫరా చేయనున్నారు. రేపల్లెలో రక్షిత మంచినీటి పథకం అభివృద్ధికి రూ.26.46 కోట్లు, బలహీన వర్గాలకాలనీల్లో తాగునీటి వసతికి రూ.4.74 కోట్ల వ్యయం చేయనున్నారు.





ఆనందాల కేళి.. దీపావళి

వెలుగుల జిలుగులు.. దీపాలంకరణలతో నిండిన లోగిళ్లు.. టపాకాయల మోతలతో దద్దరిల్లిన పరిసరాలు.. చిన్నా పెద్ద కేరింతలు.. దీపావళి ఆనందాల కేళిగా హోరెత్తింది. శుక్రవారం పల్లెపట్టణం అన్న తేడా లేకుండా దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. వ్యాపారులు తమ దుకాణాలను పూలతో తీర్చి దిద్ది ప్రత్యేకపూజలు చేశారు. సాయంత్రం ఆరు గంటల నుంచి అర్ధరాత్రి వరకు టపాసుల మోతలు మిన్నంటాయి.

- గుంటూరు

ధరల నియంత్రణకు.. కమిటీ

- నిర్వీర్యమైపోయిన కమిటీల పునరుజ్జీవం
- చైర్‌పర్సన్‌గా కలెక్టర్, మరో 16 మంది నియామకం
- నూతన విధివిధానాలను ఖరారు చేసిన ప్రభుత్వం
- మొక్కుబడి సమావేశాలు కాకుండా ధరల పర్యవేక్షణకు ఆదేశాలు

గుంటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ధరల పర్యవేక్షణ, నియంత్రణ, మార్కెట్ ఇంటర్‌వెన్షన్ జిల్లా కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొన్నేళ్ల నుంచి నిర్వీర్యమైపోయిన ధరల నియంత్రణ కమిటీకి పునరుజ్జీవం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే నూతన కమిటీని నియమించి విధివిధానాలను ఖరారు చేసింది. కమిటీకి కలెక్టర్ చైర్‌పర్సన్‌గా నియమించింది. వైస్‌చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా పౌరసరఫరాల అధికారి, సభ్యులుగా వ్యవసాయాధికారి, ఉద్యాన జేడీ/డీడీ, రైతుబజార్ల ఎస్టేట్ అధికారి, వాణిజ్యపన్నుల శాఖ అధికారి, మార్కెటింగ్ డీడీ/ఏడీ, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, వంటనూనెల మర్చంట్స్, పప్పు మిల్లుల సంఘాల అధ్యక్షులు, రైతు సంఘాలు, రైస్‌మిల్లర్లు, హోల్‌సేల్ తిండి గింజల వ్యాపారుల నుంచి ఒక్కొక్కరిని నియమించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. వీరితో పాటు రిటైలర్స్ నుంచి ఒకరు, పరిస్థితిని బట్టి ఇతర సరుకులు విక్రయించే వ్యాపారుల నుంచి ఒకరిని నియమించుకోవాలని సూచించింది. ఇటీవల కాలంలో తరచుగా నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం వంటనూనెల ధర లీటర్‌కు రూ.25కి పైగా పెరిగింది. ఉల్లిపాయలు కేజీ రూ.60 వద్ద కొనసాగుతున్నాయి. వెల్లుల్లి ధర కేజీ రూ.300 పైమాటే. కందిపప్పు రూ.150కి పైగా ఉన్నది. బియ్యం ధరలు కేజీ రూ.50 నుంచి రూ.65 వరకు ఉన్నాయి. ఇకపై మొక్కుబడిగా మూడు, నాలుగు నెలలకు సమావేశాలు నిర్వహణకు పరిమితం కాకుండా నిత్యవసర సరుకుల ధరలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది. ధరల పరిస్థితి, మార్కెట్‌లో సరుకుల లభ్యతపై ప్రతీ వారం సమీక్షించాలని సూచించింది. ఏదైనా సరుకు ధర పెరిగితే అందుకు దారి తీస్తున్న కారణాలను విశ్లేషించాలి. ఆ వెంటనే ధరలను తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. సరుకుల బ్లాక్‌మార్కెటింగ్, నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలను అరికట్టాలి. ధరల స్థిరీకరణ ప్రణాళిక రూపొందించి ఎగ్జిక్యూటివ్ కమిటీకి నివేదించాలి. కాగా ప్రణాళికా శాఖ మండల స్థాయిలో కొన్ని ఎంపిక చేసిన సరుకుల ధరలను సేకరించి కన్స్యూమర్ ప్రైస్ మొబైల్ అప్లికేషన్(సీపీ యాప్)లో అప్‌లోడింగ్ చేయాలి. అలానే రైతుబజార్ల ఎస్టేట్ అధికారి కూరగాయల ధరలను ఇదే యాప్‌లో అప్‌లోడింగ్ చేయాలని ప్రభుత్వం సూచించింది.

హత్య కేసు నుంచి తప్పించేందుకు విఫలయత్నం

4

- హతురాలి కుమారుడు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- నిందితుల జాబితాలో నందిగం సురేశ్ పేరు చేర్చని వైనం
- ప్రస్తుత విచారణలో 78వ నిందితుడిగా నందిగం

రేషన్ బియ్యం పక్కదారి

- తహసీల్దార్ రాకతో ఎండీయూ ఆపరేటర్ పరార్
- 450 కేజీలు (తొమ్మిది బస్తాలు) వ్యత్యాసం
- విచారణ అనంతరం చర్యలు చేపడతామన్న తహసీల్దార్
- పేదల రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

6

అర్హులకు దీపం చేరువ చేయాలి

- పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- ఫిర్యాదుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ఏటుకూరులో పథకం ప్రారంభోత్సవంలో కలెక్టర్ నాగలక్ష్మి



లబ్ధిదారునికి గ్యాస్ సిలిండర్ అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి దీపం పథకం అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఏటుకూరులో జరిగిన దీపం-2 పథకం జిల్లాస్థాయి ప్రారంభోత్సవంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జేసీ భార్గవతేజ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులతో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్యాస్‌పై రాయితీ నామమాత్రంగా ఉండటంతో సూపర్ సిక్స్ హామీల అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం దీపం-2 పథకాన్ని అందుబాటులో తీసుకుచ్చిందన్నారు. తొందరపడాల్సిన అవసరం లేదని వచ్చే ఏడాది మార్చి 31 లోపు గ్యాస్ బుక్ చేసుకున్న వారికి నగదు బ్యాంకులో జమవుతుందన్నారు. ఫిర్యాదులు, సూచనల కోసం టోల్ ఫ్రీ నెంబరు 1967కు లేదా, కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూం ఫోన్ 73968 83179 సమాచారం ఇవ్వాలని తెలిపారు. దీపం - 2 పథకం అమలుకు ఈకేవైసీ పేరుతో గ్యాస్ ఏజెన్సీలు నగదు వసూలు చేయరాదన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కోటి నెరవేరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పథ కాలతో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.50 వేలు నుంచి లక్ష వరకు వస్తాయని తెలిపారు. జిల్లాలో దాదాపు 4,22,769 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, ఈ పథకానికి రూ.200 కోట్ల వరకు ప్రభుత్వం ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ చిత్ర పటాలకు ఎమ్మెల్యేతో కలసి మహిళలు పాలాభిషేకం చేశారు. అనంతరం సిలిండర్లు తరలించే ఆటోలను, కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఏటుకూరులో ఇంటింటికి వెళ్లి వృద్ధులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. అనంతరం దేవరగొండ ధనలక్ష్మి ఇంటికి కలెక్టర్, ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి గ్యాస్ సిలిండర్‌ను అందించి కాఫీ తాగారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్‌వో కోమలి పద్మ, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, కార్పొరేటర్లు లక్ష్మీదుర్గా, సిత్మపద్మజ, నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, ఇమ్మడి మల్లికార్జునరావు, కల్లూరి శ్రీనివాసరావు, ఉప్పు వెంకటరత్తయ్య, కల్లూరి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా కాల్చే విషయంలో ఘర్షణ

- ఓ కుటుంబంపై బార్ యజమాని విచక్షణా రహితంగా దాడి
- తల్లి, కుమారుడికి గాయాలు.. పోలీసుల కేసు నమోదు

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్నర్‌రింగ్ రోడ్డులో ఓ అపార్ట్మెంట్ వద్ద బాణాసంచా కాల్చే విషయంలో జరిగిన వివాదం ఓ కుటుంబంపై ఓ బార్ యజమాని అతడి అనుచరులు విచక్షణారహితంగా దాడి చేశారు. గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి సీఐ వంశీధర్ కథనం మేరకు వివరాలు.. జేసీహెచ్ ప్యారడైజ్ అపార్ట్మెంట్‌కు చెందిన గుడిబండ్ల సోనియా, ఆమె కుటుంబ సభ్యులు సెల్లార్‌లో బాణసంచా కాలుస్తున్నారు. పెద్దగా శబ్దాలు రావడం వల్ల పిల్లల భయపడుతున్నారంటూ ఎదురింట్లో ఉండే బార్ యజమాని నరేందర్‌రెడ్డి సోనియా కుటుంబీకులను హెచ్చరించాడు. ఈ విషయంలో ఇరు వర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో నరేందర్‌రెడ్డి, ఆయన అనుచరులైన డేవిడ్, రవితేజ, ఫయాజ్, మరికొందరు సోనియా ఆమె కుమారుడిపై దాడి చేసి విచక్షణ రహితంగా కొట్టారు. కారులో నలుగురు వచ్చారని, ద్విచక్ర వాహనంపై మరో ఇద్దరు వచ్చి రాడ్లతో కొట్టి చంపడానికి ప్రయత్నించారని సోనియా తెలిపారు. డేవిడ్ అనే వ్యక్తి తన మెడ పట్టుకుని కొట్టాడని, వారంతా తమను కులం పేరుతో దూషిస్తూ అసభ్యకరంగా పదజాలంతో దుర్భాషలాడారన్నారు. అనంతరం తాము ఫ్లాట్లోకి వెళ్తుండగా 15 నుంచి 20 మంది ఇంట్లోకి చొరబడి తిరిగి తమపై దాడి చేసి ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేశారన్నారు. రాత్రి పది గంటల సమయంలో పోలీసులు వచ్చి తమను జీజీహెచ్‌కు తరలించారని ఆమె తెలిపారు. ఈ ఘటనలో తనకు, తమ కుమారుడికి గాయాలయ్యాయన్నారు. రవితేజ అనే వ్యక్తి కాలుతో చేతిని నలిపేయడంతో ఆరు కుట్లు పడ్డాయని, ఫయాజ్ అనే వ్యక్తి తన కుమారుడ్ని కాళ్లతో తన్నాడన్నారు. బాధితురాలు సోనియా ఫిర్యాదు మేరకు పోలీసులు నరేందర్‌రెడ్డి, డేవిడ్, రవితేజ, ఫయాజ్‌లతో పాటు మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఆస్పత్రిలో చేరి ఫిర్యాదు చేసిన నరేందర్‌రెడ్డి

ఇదిలా ఉంటే తమపై దాడి చేసి కొట్టారని బార్ యజమాని నరేందర్‌రెడ్డి ఆయన అనుచరుడు అరండల్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. దాడిలో తమకు గాయాలైనట్లు నరేందర్‌రెడ్డి కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జనసేన నేత తనయుడిపైనా దాడి

నరేందర్‌రెడ్డి సోనియాతో పాటు ఆమె కుమారుడిపైనే కాక జనసేన నేత కుమారుడిపై కూడా దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే జనసేన నేత వర్గీయులు నరేందర్ రెడ్డి, డేవిడ్, రవితేజ తదితరులపై దాడి చేసి కొట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

జంగాకు టీటీడీ బోర్డు పదవి అభినందనీయం


మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబరుగా నియమితుడైన మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి యాదవ్‌ని అఖిల భారత యాదవ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం గుంటూరులోని ఆయన నివాసానికి వచ్చిన అఖిల భారత జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు తాళ్ల నాగరాజు యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జంగాకు సీఎం చంద్రబాబు నాయుడు పదవిని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో తిరుమల తిరుపతి దేవస్థానంలో యాదవులకు సముచిత స్థానం కల్పించాలని, అలాగే శరభయ్య యాదవ్ విగ్రహాన్ని తిరుపతిలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరు పేరయ్య యాదవ్, మద్దుల వెంకట కోటయ్య, పెద్దిబోయిన బాలయ్య యాదవ్, కొండేపి శేఖర్ యాదవ్, అలా గంగారావు, చావలి గోపి, తొలుసూరి శివ గండు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై బాబాయ్ అత్యాచారం

- గర్భం దాల్చిన బాలిక

పెదకాకాని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంత బాబాయ్ మానవత్వాన్ని మరిచాడు. తన అన్న కుమార్తె అన్న విచక్షణ లేకుండా కామాంధుడిలా బరితెగించాడు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలో జరగగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు శుక్రవారం తెలిపారు. పెదకాకానికి చెందిన ఓ వ్యక్తి తన అన్న కుమార్తెపై కన్ను వేశాడు. మాయ మాటలు చెప్పి లోపరచుకొని, గత నాలుగు నెలలుగా బాలికపై అత్యాచారం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆ బాలిక మూడు నెలల గర్భం దాల్చింది. విషయం బహిర్గతం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

పెదకాకాని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. కాకాని రోడ్డులోని తారకరామ నగర్‌కు చెందిన మాచర్ల హరిబాబు(35) అనే వ్యక్తి పాలిష్ రాళ్ల పని చేస్తుంటాడు. భార్యతో మన స్పర్థలు రావడంతో గడ్డిపాడు సమీపంలోని ఇన్నర్ రింగ్ రోడ్డు రైలు గేటు వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీన పరుచుకొని మార్చురీకి తరలించారు.

హత్య కేసు నుంచి తప్పించేందుకు విఫలయత్నం

- హతురాలి కుమారుడు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- నిందితుల జాబితాలో నందిగం సురేశ్ పేరు చేర్చని వైనం
- ప్రస్తుత విచారణలో 78 నిందితుడిగా నందిగం

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతంలోని వెలగపూడి దళిత కాలనీలో జరిగిన మెండెం మరియమ్మ హత్య కేసు నుంచి నాటి బాపట్ల ఎంపీ నందిగం సురేశ్‌ను తప్పించేందుకు పోలీసులు శత విధాల ప్రయత్నించారు. చివరకు కోర్టులను సైతం తప్పుదారి పట్టించేలా వ్యవహరించారు. హతురాలి కుమారుడుతోపాటు కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఎంపీ నందిగం సురేశ్ ప్రోద్బలంతోనే మరియమ్మ హత్య జరిగిందని పేర్కొన్నప్పటికీ పోలీసులు నిందితుల జాబితాలో ఆయన పేరు కనిపించకుండా జాగ్రత్త పడ్డారు. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా (ఎ1) సురేశ్‌ను చేర్చాల్సి ఉన్నప్పటికీ పోలీసులు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలీస్ వ్యవస్థ అత్యంత దారుణంగా వ్యవహరించిందనడానికి మరియమ్మ హత్య కేసు దర్యాప్తు ఉదంతమే కారణంగా చెప్పుకోవచ్చు.

ఫిర్యాదులో పేర్కొన్నా పట్టించుకోలేదు..

రాజధాని ప్రాంతంలోని ఉద్దండరాయుని పాలెం కు చెందిన నందిగం సురేశ్ వైసీపీ నుంచి బాపట్ల ఎంపీగా గెలుపొందారు. బాపట్ల ఎంపీ అయినప్పటికీ స్థానికంగా రాజధాని ప్రాంతానికి చెందిన వాడు కావడంతో ముఖ్యంగా తుళ్లూరు మండలంపై ఆయన ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. దీనిలో భాగంగా రాజధానిలో కీలక ప్రాంతమైన వెలగపూడిలోని దళిత కాలనీలో ఎస్సీ సామాజిక వర్గంలోని రెండు ఉప కులాల మధ్య ఎప్పటి నుంచో వైరం ఉంది. దళితవాడ మెయిన్ రోడ్డుపై మాల సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు ఉన్నాయి. మెయిన్ రోడ్డు నుంచి లోనికి వెళ్తే వీరి కాలనీ దాటిన తర్వాత మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారి ఇళ్లు ఉన్నాయి. మాదిగ వర్గానికి చెందిన కుటుంబాలు నందిగం సురేశ్‌ను అనుసరిస్తున్నాయి. ఈ క్రమంలో బాపట్ల ఎంపీగా నందిగం సురేశ్ విజయం సాధించిన తర్వాత ఆ కాలనీలో ఆయన వర్గీయులు హవా కొనసాగించారు. ఆ కాలనీ మెయిన్ రోడ్డుపై ఆర్చ్ నిర్మించాలని సురేశ్ వర్గీయులు నిర్ణయించారు. అంతేగాక ఆర్చ్‌కి బాబు జగ్జీవన్‌రామ్ పేరు పెట్టాలని, ఆ తర్వాత మొత్తం కాలనీ కూడా జగ్జీవన్‌రామ్ కాలనీగా నామకరణం చేయాలని వారు భావించారు. అయితే తాము నివాసం ఉండే తమ ఇళ్ల వద్ద మీరు ఎలా ఆర్చ్ కట్టుకుంటారని, మీ ఇళ్ల వద్ద మీరు ఆర్చి కట్టుకోవాలని మాల సామాజిక వర్గానికి చెందినవారు అభ్యంతరం చెప్పారు. ఈ విషయంలో ఆ రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. దీంతో 2020 డిసెంబర్ 24న ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ విషయం మనసులో పెట్టుకున్న ఇరువర్గాలు అదే నెల 27న మరోసారి గొడవపడి రాళ్లు రువ్వుకున్నాయి. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన పలువురికి తలలు పగిలాయి. నందిగం సురేశ్ వర్గీయులు చేసిన దాడిలో ప్రత్యర్థి వర్గానికి చెందిన మెండెం మరియమ్మ తలకు బలమైన రాయి తగిలింది. ఆసుపత్రికి వెళ్లే సమయానికి ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై మరియమ్మ కుమారుడు మెండెం బాబు తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంపీ నందిగాం సురేశ్ ప్రోద్బలంతోనే తమపై దాడి చేసి తన తల్లి మరియమ్మను హత్య చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ఫిర్యాదులో ఎంపీ నందిగం సురేశ్‌తోపాటు మరో 36 మంది పేర్లను పేర్కొన్నారు. అయితే పోలీసులు క్రైం నంబర్ 390/2020 గా నమోదు చేసిన కేసులో ఐపీసీ 147, 148, 302, 109 రెడ్ విత్ 149 సెక్షన్లను పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పది మంది నిందితుల పేర్లను పేర్కొన్నారు. మిగిలిన వారి పేర్లు రాయకుండా నిందితులుగా పేర్కొన్నారు. వాస్తవానికి మరియమ్మ కుమారుడు బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నందిగం సురేశ్‌ను ప్రధాన నిందితుడిగా (ఎ1) చేర్చాల్సి ఉంది. రాజకీయ ఒత్తిళ్లతో ఆ పేరు చేర్చలేదు. అలాగని ఆయన నిందితుడు కాదని కూడా పేర్కొనలేదు. ఫిర్యాదులో పేర్కొన్న వారంతా నిందితులు గానే పేర్కొన్నారు. అంతేగాక పోలీసులు ఎఫ్ఐఆర్ లో పేర్కొన్న సెక్షన్ 109 అనేది ఒకరి ప్రోద్బలంతో హత్య జరిగినట్లు సూచిస్తుంది. ఫిర్యాదులో పేర్కొన్నట్లుగా బాపట్ల ఎంపీ నందిగం సురేశ్ ప్రోద్బలం అనేదానికి సెక్షన్ 109 వర్తిస్తుంది. అయితే నిందితుల జాబితాలో మాత్రం ఆయన పేరును చేర్చలేదు.

77కు చేరిన నిందితుల సంఖ్య

ఆ తర్వాత జరిగిన కేసు విచారణలో పోలీసులు మరో 41 మందిని నిందితులుగా గుర్తించి నిందితుల జాబితాలో చేర్చారు. చట్ట ప్రకారం కనీసం ఎ1 గా చేర్చకపోయినప్పటికీ మిగిలిన 41 మంది నిందితుల జాబితాను చేరుస్తున్న సమయంలో 37వ నిందితుడిగా చేర్చి ఆ తర్వాత మిగిలిన 41 మంది పేర్లతో జాబితాను తయారు చేయాల్సి ఉంది. అలా చేయకుండా సురేశ్ పేరు తప్పించి 36 మందిని నిందితులుగా చేర్చి ఆ తర్వాత గుర్తించిన 41 మంది పేర్లను కూడా చేర్చారు దీంతో ఈ కేసులో నిందితుల సంఖ్య 77గా పేర్కొన్నారు. ఆ కేసులో మొదట నిందితులుగా గుర్తించిన 36 మందిలో ఒకరిద్దరూ ముందస్తు బెయిల్ తెచ్చుకోగా ఒకరు మృత్యువాత పడ్డారు. మిగిలిన 41 మందిని నిందితులుగా చేర్చినప్పటికీ నాలుగేళ్ల పాటు ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదు. కోర్టులో ఛార్జిషీటు కూడా దాఖలు చేయలేదు. అయితే మిగిలిన 41 మందిని నిందితుల జాబితాలో చేర్చిన తర్వాత నిందితుల బెయిల్ పిటిషన్ సందర్భంగా పోలీసులు వేసిన పిటిషన్‌లో ఆయా నిందితులకు బెయిల్ ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పేశారు.

పీటీ వారెంట్‌పై అరెస్టు

ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసులో బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు ఆ కేసు ఫైల్ ను బయటకు తీశారు. అప్పటి డీఎస్పీ జై.శ్రీనివాసరావు అత్యంత దారుణంగా వ్యవహరించినట్లు పోలీస్ ఉన్నతాధికారులు గుర్తించారు. కాగా తుళ్లూరు సీఐగా నియమితులైన గంగా వెంకటేశ్వర్లు కేసును దర్యాప్తు చేస్తున్నారు. దీనిలో భాగంగా హతురాలి కుమారుడు బాబు ఇచ్చిన ఫిర్యాదుతో పాటు శవ పంచనామ సమయంలో అతని బంధువులు ఇచ్చిన ఫిర్యాదులోనూ, అదేవిధంగా వారి కుటుంబ సభ్యులు నలుగురు పోలీసులకు ఇచ్చిన స్టేట్మెంట్ లోనూ నందిగం సురేష్ పేరు స్పష్టంగా ఉంది. వాటన్నింటిని పరిగణలోకి తీసుకున్న సీఐ వెంకటేశ్వర్లు ఈ కేసులో 78వ నిందితునిగా సురేశ్ పేరు చేర్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో నిందితునిగా జిల్లా జైలులో ఉన్న నందిగం సురేశ్‌ను ఈ హత్య కేసులో పీటీ వారెంట్‌పై అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆయన జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఇటీవలే సురేష్‌ను తుళ్ళూరు పోలీసులు రెండు రోజులు కస్టడీకి తీసుకుని విచారించారు. విచారణకు సురేశ్ సహకరించలేదని పోలీసులు తెలిపారు.

ఆస్తి కోసం కన్నకొడుకునే కడతేర్చిన తల్లి


వివరాలు వెల్లడిస్తున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు

క్రోసూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి ఆస్తికోసం కన్నకొడుకునే బంధువులు, మరో కుమారుడితో కలిసి హత్య చేయించింది ఓ కసాయి తల్లి. క్రోసూరు మండలం హసానాబాద్‌లో అక్టోబరు 27 రాత్రి జరిగిన ఈ సంఘటనలో పది మంది నిందితులను అరెస్టు చేసినట్లు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. హసానాబాద్‌కు చెందిన షేక్ మున్నీబీకి ఇద్దరు భర్తలు ఉండేవారు. సుమారు 20 ఏళ్ల క్రితం విడిపోయిన మొదటి భర్తకు షేక్ మహబూబ్ బాషా అనే కుమారుడు ఉన్నాడు. తర్వాత వివాహం చేసుకున్న రెండో భర్తకు షేక్ అబ్దుల్ బాషిత్, షేక్ పాతిమా సంతానం ఉన్నారు. పెద్ద కుమారుడు మహబూబ్ బాషాకు విడిపోయిన భర్త ద్వారా ఎకరం 50 సెంట్ల పొలం, ఐదు సెంట్ల స్థలం, తాత ద్వారా అర ఎకరం పొలం వచ్చింది. రెండో భర్త కుమారుడు బాషిత్‌కు 50 సెంట్ల పొలం, 25 సెంట్ల స్థలం రెండో భర్త ద్వారా వచ్చింది. రెండో భర్త 15 ఏళ్ల క్రితం చనిపోయాడు. పెద్ద కుమారుడికి ఎక్కువ ఆస్తి, రెండో కుమారుడికి తక్కువ ఆస్తి రావడాన్ని తల్లితో సహా, రెండో కుమారుడు, బంధువులు జీర్ణించుకోలేక పోయారు. ఆస్తి మొత్తం కలిపి సమానంగా పంచుకుందామని తరచూ గొడవలు పడుతుండేవారు. పెద్ద కుమారుడు మహబూబ్ బాషా దీనికి ససేమిరా అనడంతో అతన్ని ఎలాగైనా కడతేర్చి ఆస్తి కాజేయాలని పథకం పన్నారు. అక్టోబరు 27 రాత్రి షేక్ అబ్దుల్ బాషిత్, తల్లి షేక్ మున్నీబీ, బంధువులు జైలాలబ్దీన్, నాగుల్ మీరా, నన్నే సాహెబ్, మాబు సుభాని, మహబూబ్ సుభాని, కరీముల్లా, పెద్ద బాజీ, నుషరత్, మరో నలుగురు కలిసి కర్రలు, ఇనుప రాడ్లు, కారం, మొదలైన వాటితో మహబుబ్ బాషా ఇంటికి వెళ్లి విచక్షణా రహితంగా కొట్టారు. అడ్డుకోబోయిన భార్య షేక్ కౌషర్, మామ చిన్నబాజీ, ఆర్నెల్ల చిన్నారిపై కూడా దాడి చేశారు. గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్టోబరు 28న ఉదయం మహబూబ్ బాషా మృతి చెందాడు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు పర్యవేక్షణలో సీఐ వి.సురేష్, క్రోసూరు ఎస్ఐ కె.నాగేంద్రరావు, మరో నలుగురి కానిస్టేబుల్‌తో కూడిన బృందం పది మంది నిందితులను అరెస్టు చేసినట్లు, వారి నుంచి ఇనుప రాడ్లు, మోటారు సైకిల్‌లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను సత్తెనపల్లి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు పంపినట్లు తెలియజేస్తూ 48 గంటల్లో నిందితులను అరెస్టు చేసిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

నేతాజీ నగర్ చెరువులో మృతదేహం

గుంటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని నేతాజీనగర్ వద్ద ఉన్న చెరువులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీ సుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నేతాజీ నగర్‌కు చెందిన సుందర్ రాజన్ (55) ఒక కళాశాలలో వంట మాస్టర్‌గా పనిచేస్తుంటాడు. ఆయనకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పెరుమాళ్ళ సాయి ప్రకాష్ విశాఖపట్నంలోని ఐటీసీ హోటల్లో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు వివాహమైంది. రెండో కుమారుడు పవన్ కుమార్ హైదరాబాదులో సీఏగా ఉద్యోగం చేస్తున్నాడు. మద్యం అలవాటున్న సుందర రాజన్ అప్పుడప్పుడు భార్యతో గొడవ పడి బయటికి వెళ్లి రెండు మూడు రోజుల తర్వాత వస్తుండేవాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం కూడా సుందర రాజన్ ఇంటి నుంచి బయటకు వెళ్ళాడు. ఎంత సేపటికి ఆయన తిరిగి ఇంటికి రాకపోవడంతో, తమ పెద్ద కుమారుడికి ఫోన్ చేసి న తల్లి ఈ విషయం చెప్పింది. విశాఖపట్నం నుంచి బయలుదేరి శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు సాయిప్రకాష్ ఇంటికి వచ్చాడు. తండ్రి కోసం చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. అయితే, వారి ఇంటి కి సమీపంలోని నేతాజీనగర్ చెరువులో శుక్రవారం సాయంత్రం మృతదేహం ఉన్నట్లు స్థానికులు చెప్పడంతో ఇద్దరు కుమారులు వెళ్లి పరిశీలించి, ఆ మృతదేహం తండ్రి సుందర రాజన్‌గా గుర్తించారు. సాయి ప్రకాష్ ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడ్డాడా, మద్యం సేవించి మత్తులో పడిపోయాడా లేదంటే ఆత్మహత్య చేసుకున్నాడా అనేది తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. సుందర రాజన్‌కు ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం లేదని కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రకాశం జిల్లా యువకుడి ఆత్మహత్య


యలమందరావు (ఫైల్)

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో రెడ్డి పాలెం రైల్వే గోడౌన్స్ సమీపంలోని రైలు పట్టాలపై ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన యువకుడు దగ్గుపాటి యలమందరావు చౌదరి ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. గురువారం రాత్రి సుమారు పదకొండున్నర గంటల సమయంలో రైల్వే సిబ్బంది అతని మృతదేహాన్ని గమ నించారు. మృతుడి జేబులోని స్లిప్‌లో ఫోన్ నంబర్లు ఎరు ఉన్నాయి. ఆ నంబర్ ఆధారంగా రైల్వే పోలీసులు దర్యాప్తు చేయగా మృతుడు మార్కాపురానికి చెందిన యలమంద రావు చౌదరిగా గుర్తించారు. యలమందరావు ఇంటర్ పూర్తి చేసి హైదరాబాదులో సీఏ కోచింగ్ తీసుకుంటు న్నట్లు అతని తండ్రి పోలీసులకు తెలిపారు. రైల్వే ఎస్సై సమాచారంతో శనివారం యలమందరావు కుటుంబ సభ్యులు రానున్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన పెంచుకోవాలి

గుంటూరు, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి) : సైబర్ క్రైమ్‌పై విద్యార్థులు అవగాహన పెంచు కోవాలని సీఐడీ సీఐ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ సైబర్ క్రైమ్‌లో వివిధ నేరాల గురించి వివరించారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్, ఆన్ లైన్ ఇన్వెస్ట్మెంట్స్, యూపీఐ ఫ్రాడ్స్ తదితర నేరాలపై అవగాహన కల్పించారు. ఎన్‌సీఆర్‌పీకి ఎలా ఫిర్యాదు చేయాలి, 1930 హెల్ప్ లైన్ గురించి వివరించారు.

రైలు ఢీకొని తల్లీ కూతురు మృతి

- కావలి రైల్వే స్టేషన్‌లో ఘటన


వజ్రమ్మ (ఫైల్ ఫొటో)


శిరీష (ఫైల్ ఫొటో)

పిట్టలవానిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని తల్లీ కూతురు మృతి చెందిన ఘటన కావలి రైల్వే స్టేషన్‌లో జరిగింది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా అల్లూరుకు చెందిన నత్తల వజ్రమ్మ(60) కావలి పట్టణంలోని బర్మాషల్ వీధిలో నివాసం ఉంటున్న కుమార్తె గర్నెపూడి శిరీష(35) వద్దకు వచ్చింది. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు గురువారం తెల్లవారుజామున బయలుదేరింది. తల్లి నత్తల వజ్రమ్మను తీసుకుని స్వగ్రామంలో వదిలి వచ్చేందుకు తల్లితోపాటు కుమార్తె రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అయితే ఒంగోలు వైపు వెళ్లే రైళ్లు 3వ నంబరు ప్లాట్‌ఫాం మీదకు వస్తుండటంతో తల్లీ కూతురు 3వ నంబరు ప్లాట్‌ఫాంపై ఆగారు. అయితే బిట్రగుంట నుంచి విజయవాడ వెళ్లే ప్యాసింజర్ రైలు 1వ నంబరు ప్లాట్‌ఫాంపైకి వస్తున్నట్లు రైల్వే అధికారులు అనవున్స్‌మెంట్ చేయడంతో వారివురు 3వ నంబరు ప్లాట్‌ఫాం నుంచి 1వ నంబరు ప్లాట్‌ఫాం పైకి వచ్చేందుకు పట్టాలపై దిగారు. కుమార్తె శిరీష ముందుగా 2వ నంబరు ప్లాట్‌ఫాంపైకి ఎక్కింది. ఆమె తల్లి వజ్రమ్మ ఎక్కలేకపోగా అదే సమయంలో ఆ పట్టాలపై రైలు వస్తుండడంతో తల్లిని కాపాడేందుకు ప్లాట్‌ఫాం దిగి ఆమెను పైకి ఎక్కించే క్రమంలో కోయంబత్తూరు ఎక్స్‌ప్రెస్ వేగంగా వచ్చి వారిని ఢీకొంది. దీంతో ఇరువురి మృతదేహాలు పట్టాలపై చల్లాచెదరుగా పడ్డాయి. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వజ్రమ్మ మృతదేహాన్ని అల్లూరు గ్రామ పంచాయతీలోని నత్తలవారిపాలెం గ్రామానికి, శిరీష మృతదేహాన్ని నాదెండ్ల మండలం తిమ్మాపురం గ్రామానికి తీసుకెళ్లారు.

డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేటు

- అర్బన్ బ్యాంకు చైర్మన్ శ్రీనివాస యాదవ్



గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డిపాజిట్లపై అత్యధిక వడ్డీరేటు చెల్లిస్తున్నామని ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాసయాదవ్ తెలిపారు. స్వల్ప, దీర్ఘకాలిక పరిమితిని బట్టి వడ్డీరేట్లు అమలు చేస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లకు అదనంగా చెల్లింపులు చేస్తున్నామని చెప్పారు. ఖాతాదారుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తూ బ్యాంకుని లాభాల బాట పట్టించిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ఫటా ఫట్

అర్బన్ బ్యాంకులో వడ్డీరేట్లు ఎలా ఉన్నాయి?

చైర్మన్: 30 నుంచి 90 రోజుల వరకు సాధారణ పౌరులు, సీనియర్ సిటిజన్స్‌కి 5.50 శాతం, 91 నుంచి 180 రోజులకు సాధారణ పౌరులకు 6.50 శాతం, సీనియర్ సిటిజన్స్‌కి 7 శాతం, 181 రోజుల నుంచి 12 నెలల్లోపు 7.50 శాతం, 8 శాతం, 12 నెలల నుంచి 36 నెలల వరకు 8.50 శాతం, 9 శాతం, 36 నెలలపైన 8.60 శాతం, 9.10 శాతం చెల్లిస్తున్నాం.

రుణాలు ఎన్ని కేటగిరీల్లో ఇస్తున్నారు?

చైర్మన్: మార్ట్‌గేజ్, హోం, గోల్డ్, ప్రాజెక్టు ఫైనాన్స్, ఓవర్ డ్రాఫ్టు, అర్బన్ షార్ట్ టర్మ్, వెహికల్, ఎడ్యుకేషన్ రుణాలు అతి తక్కువ వడ్డీతో ఇస్తున్నాం.

డిజిటల్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయా?

చైర్మన్: ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్, ఏపీబీఎస్, ఆర్‌టీజీఎస్/ఎన్ఈఎఫ్‌టీ, ఏ బ్రాంచ్‌లోనైనా బ్యాంకింగ్, డిమాండ్ డ్రాఫ్టు అండ్ పే ఆర్డర్, సీటీఎస్ క్లియరింగ్, పాజిటివ్ పే, యూపీఐ, ఏసీహెచ్ క్రెడిట్ డెబిట్, ఐఎంపీఎస్, మొబైల్ బ్యాంకింగ్, క్యూఆర్ కోడ్ పేమెంట్ స్కానర్ కోడ్, మొబైల్ అప్లికేషన్లు అందుబాటులోకి తీసుకొచ్చాం.

మొండి బకాయిల విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టారు?

చైర్మన్: బ్యాంకు సిబ్బంది అందరిలో జవాబుదారితనాన్ని పెంచాం. సీసీటీవీ సర్వైలెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు వారి పనితీరుని గమనిస్తున్నాం. రుణాల రికవరీ బాధ్యత అప్పగించి మొండిబకాయిదారుల ఇళ్లకు పంపిస్తున్నాం. బాధ్యతారహితంగా విధులు నిర్వహించే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నాం.

టీటీడీ బోర్డు సభ్యుడిగా నన్నపనేని



తుళ్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు సభ్యుడిగా తుళ్లూరు మండలం దొండపాడు గ్రామానికి చెందిన నన్నపనేని సదాశివరావును కూటమి ప్రభుత్వం నియ మించింది. నాట్కో ఫార్మా సంస్థ వైస్ చైర్మన్‌గా కొనసా గుతున్న సదాశివరావు అనేక స్వచ్ఛంద సేవా కార్యక్ర మాలను నిర్వహించారు. పదిహేను సంవత్సరాల క్రితమే దొండపాడులో నాట్కో సంస్థ తరుపున శుద్ధ తాగు జల కేంద్రం ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందజేశారు ఇప్పటికి ఆ మినరల్ ప్లాంట్ నుంచి కేవలం రూ.2లకే 20 లీటర్ల అందిస్తున్నారు. వెంకటపాలెం చిగురు అనాథ బాలల ఆశ్రమ సంక్షేమానికి భారీ విరాళాలు అందించారు. గుంటూరు జీజీహెచ్‌లో క్యాన్సర్ డయోగ్నస్టిక్ యూనిట్‌ను నాట్కో సంస్థ తరుపున బిల్డింగ్‌ను నిర్మాణం చేసి ఉచితంగా వైద్య సేవలు అందించటంలో నన్నపనేని సదాశివరావు కృషి చేశారు. ఇవే కాక వివిధ ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు అమలు చేయ టంలో నన్నపనేని సదాశివరావు పేరు సంపాదించారు. సీఎం చంద్రబాబు నాయుడు సదా శివరావు సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి గురువారం టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించారు. సమాజ సేవా దృక్పథం, రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు ప్రాధాన్యతనిస్తూ ఆ ప్రాంతానికి చెందిన నన్నపనేని సదాశివరావుకు పదవిని కేటాయించటంపై రైతు జేఏసీ నాయకులు, రైతులు, రైతు కూలీలు, మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

థాయిలాండ్ అంతర్జాతీయ సదస్సుకు వర్సిటీ అధ్యాపకులు

పెదకాకాని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): థాయిలాండ్, బ్యాంకాక్‌లో ఈనెల 8, 9 తేదీల్లో జరగనున్న 'పరిశోధన - ఆవిష్కరణలపై' అంతర్జాతీయ సమావేశానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎకనామిక్స్ విభాగధిపతి, పీజీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య కడిమి మధుబాబు, వర్సిటీ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగధిపతి ఆచార్య బి.నాగరాజు హాజరు కానున్నారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ సైంటిఫిక్ రీసెర్చ్ అసోసియేషన్ నుంచి అధికారిక ఆహ్వాన పత్రిక అందినట్లు ఆచార్య మధుబాబు తెలిపారు. యురేషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, షినవత్రా విశ్వవిద్యాలయం, పాతుమ్ థాని, థాయిలాండ్, రిసెర్చ్ కల్చర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు జరుగుతుందని చెప్పారు. సదస్సులో "స్వచ్ఛ భారత్ మిషన్ అండ్ ఇట్స్ రోల్ ఇన్ ట్రాన్స్ఫార్మింగ్ రూరల్ శానిటేషన్ ఇన్ ఇండియా" అంశంపై ఆచార్య మధుబాబు, "ఎక్స్ప్లోరింగ్ క్వాలిటీ ఆఫ్ వర్క్ లైఫ్ ఫర్ వుమెన్ ఎంప్లాయిస్: ఏ కే స్టడీ ఇన్ సౌత్ సెంట్రల్ రైల్వే" అంశంపై డాక్టర్ నాగరాజు పరిశోధన పత్రం సమర్పణకు అనుమతి లభించినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రం సమర్పించనున్న ఆచార్య మధుబాబు, ఆచార్య నాగరాజులను వర్సిటీ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

ఉరి వేసుకొని గొర్రెలకాపరి ఆత్మహత్య

పిట్టలవానిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు కాచే ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని మంతెనవారిపాలెం గ్రామపంచాయతీకి చెందిన ముకిరి కోటయ్య (21) గొర్రెల కాపరిగా పనిచేస్తు న్నారు. తన ఇంటి ప్రాంతంలో ఉన్న ఓ వ్యక్తికి సంబంధించిన రెండు గొర్రెలను తన గొర్రెలతోపాటు కోటయ్య అమ్ముకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఆ వ్యక్తి మృతుడిపై దౌర్జన్యంగా మాట్లాడి పోలీసుస్టేషన్‌లో కేసుపెడతానని బెదిరిం చాడని, దీనికి మనస్తాపం చెంది ఉరి వేసుకుని మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట నవంబరు 1 (ఆంధ్రజోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టియంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 31,137 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 30,234 క్యూసెక్కుల నీరుదిగువ కృష్ణకు విడుదలౌతుంది. వీటిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణా నదికి చేరుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

18,503 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 12,825 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 18,503 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 18,157 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8500	16000	334	9500	15500
నెంబరు. 5	8000	9200	నెంబరు. 5	--	--
273	--	--	273	15500	15500
341	8800	14500	341	9000	13500
4884	12000	12000	4884	11800	16500
సూపర్ 10	--	--	సూపర్ 10	10000	15700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	9000	18200	తేజ	10000	18000
బ్యాడిగి	9000	15500	బ్యాడిగి	9000	14600
దేవనూరు డీలక్స్	--	--	దేవనూరు డీలక్స్	10500	12000
తెల్లకాయలు	5000	10000	తెల్లకాయలు	6000	11000

ఇన్నర్ రింగ్ రోడ్డులో బార్‌ను మరో చోటుకు మార్చండి
'సెలబ్రేషన్'ఎదుట మహిళల ఆందోళన

గుంటూరు కార్పొరేషన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డులోని బార్‌ను మరో చోటుకు మార్చాలని మహిళలు డిమాండ్ చేశారు. రింగ్‌రోడ్డు ఫేస్-2 లోని సెలబ్రేషన్ బార్ ఎదుట మహిళలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. రాత్రిపూట మద్యం బాబులు తమ కాలనీలలో గొడవ చేస్తున్నా రని, తక్షణమే ఇక్కడ నుంచి ఆ బార్‌ను మార్చాలని మహిళలు ధర్నా చేశారు. అలా జరగని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని మహిళలు హెచ్చరించారు.


పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ మనోహర్ నాయుడు

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక హిందూ కాలేజీ సెంటర్ లోని పొట్టి శ్రీ రాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకట కృష్ణ, పడాల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విజిలెన్స్ ఆధ్వర్యంలో వారోత్సవాలు

గుంటూరు సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఆధ్వర్యంలో వారోత్సవాలు జరుగుతున్నట్లు గుంటూరు ప్రాంతీయ నిఘా, అమలు అధికారి డీ సూర్య శ్రావణ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖలకు చెందిన ఉద్యోగస్తులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. డీఈ అల్లాడి శ్రీనివాస్, సీఐ లు కొమ్మలపాటి చంద్రశేఖర్, పీ శివాజీ పాల్గొన్నారు.

ఆంజనేయులు సేవలు స్ఫూర్తిదాయకం
ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

గుంటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడుగా ఆతుకూరి ఆంజనేయులు అందిస్తోన్న సేవలు స్ఫూర్తిదాయకమైనవని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక నగరాలులోని ఆంజనేయులు నివాసానికి వెళ్ళిన అప్పిరెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. చాంబర్ అధ్యక్షుడుగా రికార్డు స్థాయిలో 34 సార్లు అప్రతిహతంగా ఏకగ్రీవంగా కొనసాగుతూ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తోన్న ఆంజనేయులు ఓటమి ఎరుగని నేత అని కొనియాడారు.

ఉద్యోగులకు భద్రత కల్పించని కొత్త పెన్షన్ పథకం
● ఈదర వీరయ్య

గుంటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు కొత్త పెన్షన్ పథకం ప్రవేశపెట్టిన తర్వాత భద్రత కరువైనట్లు భావిస్తున్నారని పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు 653 ఆర్థిక శాఖ 2004 సెప్టెంబరు 22 ద్వారా ఉద్యోగులందరికి నూతన కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమల్లోకి వచ్చిందని, కేంద్ర ప్రభుత్వం వారి పెన్షన్ విధానం ఆధారంగా ప్రవేశపెట్టారన్నారు. ఇది ఉద్యోగంలో కొత్తగా చేరే వారి కోసం నూతనంగా పునఃనిర్మించిన నిర్ధారిత చందా చెల్లించాల్సిన పద్ధతిలో ఉందన్నారు.

● ప్రస్తుతం ఉన్న నిర్ధారిత పెన్షన్ విధానం స్థానంలో దీనిని ప్రవేశపెట్టారని, అసంఘటిత రంగంలో పనిచేసే వారు, స్వయం ఉపాధి కలవారు ఐచ్ఛికంగా ఈ పథకంలో చేరవచ్చని తెలిపారు. అయితే, ఇప్పటికే ఉద్యోగుల భవిష్య నిధి చట్టం 1952 ఇతర చట్టాలకు లోబడి తప్పనిసరిగా నిర్వహిస్తున్న పథకాలు కొనసాగుతాయన్నారు. కొత్త విధానంలో మౌలిక లక్షణాలు, మధ్యంతర పెన్షన్ ఫండ్ నియంత్రణ, అభివృద్ధి అథార్టీని ఏర్పరిచేందుకు కేంద్రం ఆమోదించిందన్నారు. కొత్త పెన్షన్ విధానం, నిర్దేశిత చందా చెల్లింపుల ఆధారంగా ఉంటుందన్నారు. చందాల వసూళ్ళు చందాదారుల సంప్రదింపులు, ఉద్యోగం మారిన సందర్భాల్లో లాభాల బదిలీ, వివిధ పెన్షన్ అవకాశాలు అందివ్వటం వంటి అవసరాలకు ఇప్పుడున్న బ్యాంకు శాఖలు, పోస్టాఫీసులు, నెట్‌వర్క్ ఉపయోగించుకుంటా రన్నారు. కొత్త విధానంలో పే తో కలిపి డీఏలో పదిశాతం నెలవారీ చందాగా ఉద్యోగి చెల్లించాలని, ప్రభుత్వం ఆ మొత్తాన్ని కలుపుతుందని, అయితే ప్రభుత్వ ఉద్యోగులు కానివారికి ప్రభుత్వ కంట్రిబ్యూషన్ ఉండదన్నారు. ఈ చందాలు, పెట్టుబడులపై వచ్చే ఆదాయం, ఉపసంహరించుకోవడానికి వీలులేని పెన్షన్ టైర్ ఒకటి ఖాతాలో జమ అవుతాయన్నారు. ప్రస్తుతం ఉన్న నిర్దేశిత పెన్షన్, జీపీఎఫ్, కొత్త సర్వీస్‌లో చేరే వారికి వర్తించదన్నారు. పెన్షన్ నిధులపై వడ్డీ భారం వదిలించుకోవటానికి కేంద్రం నూతన పద్ధతిని అమల్లోకి తెచ్చినప్పటికీ అంతకంటే ఎక్కువ ఖర్చు వ్యయ ప్రయాసలతో విదేశీ అప్పులకు ఎగబడుతోందన్నారు. కొత్త పెన్షన్ పథకంలో ఖాతాల నిర్వహణకు ఒక కేంద్రీకృత వ్యవస్థ కొందరు ఫండ్ మేనేజర్లు ఉంటారన్నారు. పెన్షన్ మార్కెట్ నియంత్రణ, అభివృద్ధి కోసం పెన్షన్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథార్టీ పేరున ఒక స్వతంత్ర వ్యవస్థ ఉంటుందన్నారు. నూతన పెన్షన్ విధానం ప్రవేశపెట్టిన తరువాత ఉద్యోగస్తుల భద్రతకు భంగం వాటిల్లిందని, వారు ఆందోళనకు గురవుతున్నారని ఈదర వీరయ్య పేర్కొన్నారు.

నగరాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

● స్టేక్ హోల్డర్స్‌తో సమావేశంలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు
● నగరంలో తగిన తాగునీటిని అందించలేకపోతున్నాం ● త్వరలో చర్యలు
● మేజర్ డ్రెయిన్లలో సిల్ట్ తీసేందుకు ప్రత్యేకంగా కార్మికులు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు, పక్కన మేయర్ మనోహర్ నాయుడు, అదనపు కమిషనర్ ఓబులేశు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుం టూరు నగర సమగ్రాభివృద్ధి, స్వచ్ఛగుంటూరు సాధనకు స్టేక్ హోల్డర్స్ సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం నగర సమగ్రాభివృద్ధి, స్వచ్ఛ గుంటూరు సాధనలో అధికారులు, ప్రజల భాగస్వామ్యం అంశాలపై మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీలు కెఎస్.లక్ష్మణరావు, సీహెచ్ ఏసురత్నం, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌లతో కలిసి ఆయన స్టేక్ హోల్డర్స్ మీటింగ్ నిర్వహించారు.

తొలుత నగర విస్తీర్ణం, జనాభా, రోడ్లు, పార్కులు, జీఎంసీ నుండి చేపడుతున్న తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సుమారు 11.50 లక్షల జనాభాకి తగిన తాగునీటిని అందించలేక పోతున్నామని, ప్రధానంగా విలీన గ్రామాలు, శివారు ప్రాంతాలకు సరిపడా నీటి సరఫరా జరగడం లేదని అన్నారు. ఏఐబీ, అమృత్ ప్రాజెక్ట్ లో ఫేజ్ 1, 2లను పూర్తి చేస్తే తాగునీటి సమస్య పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిసెంబర్ నాటికి గోరంట్ల కొండపై ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని, పారిశుధ్యం అంశంలో నగరంలోని 2.50 లక్షల ఇళ్లను 786 మైక్రో ప్యాకెట్స్‌గా విభజించి ఒక్కో ప్యాకెట్ కి ఇద్దరు కార్మికులను కేటాయిస్తున్నామని, మైక్రో ప్యాకెట్‌లో కేటాయించబడిన కార్మికులే ఇంటింటి చెత్త సేకరణ, అంతర్గత డ్రెయిన్ల శుభ్రం చేస్తూ పూర్తి బాధ్యత వహించేలా చర్యలు తీసుకుంటు న్నట్లు చెప్పారు. మేజర్ డ్రెయిన్లలో సిల్ట్ తీయడానికి ప్రత్యేకంగా కార్మికులను తీసుకుంటామని, వెహికిల్ షెడ్‌లో వాహనాలు, ఈ-ఆటోలు, నగర పాలక సంస్థ పరిధిలోని మూడు నియో జకవర్గాల వారీగా కమర్షియల్ వ్యర్థాల సేకరణకు వేర్వేరుగా టెండర్లు, భవన వ్యర్థాల తరలింపు నకు ప్రత్యేక యాప్, జీటీ ఏఎస్ ల ఏర్పాటు వేగ వంతం, శనివారం నుండి అమరావతి రోడ్డులో, డ్రెయిన్ ఆక్రమణల తొలగింపు మొదలైన అంశాల గురించి ఆయన ప్రస్తావించారు.

తాగునీటి సరఫరా వ్యవస్థ పటిష్టంగా లేదు

నగరానికి సరిపడా తాగునీరు ఉన్నప్పటికీ సరఫరా వ్యవస్థ పటిష్టంగా లేకపోవడం వలన పూర్తి స్థాయిలో నీటిని అందించలేక పోతున్నారని ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. నగరంలో తాగునీటి పైప్ లైన్లు, డ్రైనేజి లైన్లు ఒకే చోట ఉన్న వాటిని వెంటనే షిఫ్ట్ చేయాలని, గోరంట్ల వాటర్ ప్రాజెక్ట్ పూర్తి చేసి, రిజర్వాయర్లను నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ రాజధాని అమరావతికి చేరువగా ఉన్న గుంటూరులో అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా జరగాలని, కృష్ణా నది నుండి నీటిని నల్లపాడులోని 110 ఎకరాల చెరువుకి పంపింగ్ చేస్తే గ్రావిటీ ద్వారా నగరానికి నీటిని అందించవచ్చని, అందుకు సుమారు రూ.150 కోట్లు ఖర్చు కావచ్చని తెలిపారు.

శివారు ప్రాంతాలకు తాగునీటిని అందించాలి

ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ శివారు ప్రాంతాలు, ప్రగతినగర్ ప్రాంత ప్రజలకు తాగునీటిని అందించాల్సిన అత్యావశ్యకత ఉందన్నారు. నగరంలో ప్రత్యేకంగా వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటుకు కౌన్సిల్ తీర్మానం చేసి, ప్రభుత్వానికి పంపాలని అన్నారు. పట్టాలు లేని ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి ఆక్రమిత పన్ను విధించి నీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. అనంతరం స్టేక్ హోల్డర్స్ నుండి అర్జీలు, సూచనలను రాత పూర్వకంగా తీసుకున్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేశ్, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్.ఈ. నాగ మల్లేశ్వరరావు, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీనివాస్, టీడీపీ ఫ్లోర్ లీడర్ కె.రవీంద్ర పాల్గొన్నారు.

రోడ్డుపై ఒక్క గుంత ఉండటానికి వీల్లేదు
● ఆర్ అండ్ బీ ఈఈ విశ్వనాథరెడ్డి



గుంటూరు సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం గుంటూరు జిల్లా లోని రోడ్లను గాలికి వదిలేసింది.ఫలితంగా ఎక్కడ చూసినా గుంతలు. నరకానికి రహ దారుల్లా మారిన రోడ్లను బాగు చేయించేందుకు కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. 2025 జనవరి 16 నాటికి రోడ్లపై గుంతలు పూర్తిగా పూడ్చి వేశాలా నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని రోడ్లు, భవనాలు శాఖ చేపడుతున్న పనుల గురించి ఆర్ అండ్ బీ ఈఈ సీ విశ్వనాథరెడ్డితో 'ఆంధ్రజ్యోతి' ఫటా ఫట్.

జిల్లాలో ఎంత మేరకు రోడ్లు పాడయ్యాయి..

ఆర్ అండ్ బీ ఈఈ: గుంటూరు జిల్లాలో 96.252 కిలో మీటర్ల మేర రాష్ట్ర రహదారులు పూర్తిగా పాడయ్యాయి. అలాగే మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు 764.09 కిలో మీటర్లు ఉండగా, వాటిలో 420.467 కిలోమీటర్ల మేర పాడైనట్లు గుర్తించాం.

ప్రస్తుతం ఏ మేరకు నిధులు మంజూరయ్యాయి?



ఆర్ అండ్ బీ ఈఈ: జిల్లాలో పూర్తిగా దెబ్బతిన్న రాష్ట్ర రహదారుల్లో 45.23 కిలో మీటర్ల మేర బాగు చేసేందుకు రూ. 487.90 లక్షలు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లలో 174.64 కిలోమీటర్ల మేర బాగు చేసేందుకు రూ. 848.90 లక్షలు మంజూరయ్యాయి.

పనులు ఎప్పుడు ప్రారంభించి, ముగించాలి?

ఆర్ అండ్ బీ ఈఈ: పనులు వెంటనే ప్రారంభిస్తాము. 2025 జనవరి 16 నాటికి అన్ని పనులు పూర్తి చేయాలి. జనవరి 26 రిపబ్లిక్ డే నాటికి జిల్లాలో గుంతలు లేని రోడ్లు ఉండాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న రోడ్లపై గుంతలు లేవని ఏఈ,డీఈ సర్టిఫై చేయాల్సి ఉంటుంది.

మరి మిగిలిన వాటి సంగతి ఏమిటి?

ఆర్ అండ్ బీ ఈఈ: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇంకా కొన్ని పనులకు నిధుల అవసరం ఉంది. వాటికి కూడా అంచనాలు రూపొందించాం. త్వరలోనే నిధులు మంజూరు అవుతాయి. ఎక్కడా పని పెండింగ్ లేకుండా పూర్తి చేస్తాం.

ఇంకా పనులు ఎక్కడైనా జరుగుతున్నాయా..

ఆర్ అండ్ బీ ఈఈ: కేవలం రోడ్లకు మరమ్మతులు చేసే పనులు మాత్రమే కాక, మిగిలిన పథకాల కింద కూడా నిధులు మంజూరైన కొన్ని పనులు వేరుగా జరుగుతున్నాయి. వాటికి వీటికి సంబంధం లేదు. పని ఏదైనా ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరికి రోడ్లు అన్నీ చక్కగా ముస్తాబు అవ్వాలి.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, కమిషనర్, ఎమ్మెల్యే మాధవి, ఇతర అధికారులు

ఘనంగా వల్లభాయ్ పటేల్ జయంతి

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రీయ ఏక్ తా దివస్ సందర్భంగా గురువారం స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్ నుండి హిందూ కాలేజీ జంక్షన్ వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2 కే రన్ నిర్వహించారు. స్థానిక పోలీస్ గ్రౌండ్‌లో 2 కే రన్ ను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గల్లా మాధవి, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు , డిప్యూటీ మేయర్ సజీలాతో కలసి కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. హిందూ కాలేజీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానవ హారంగా ఏర్పడి, వేదిక నుండి ఎమ్మెల్యే మాధవి రాష్ట్రీయ ఏక్ తా దివస్ ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా మీడియాతో కలెక్టర్, ఎమ్మెలే, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేశు, డిప్యూటీ కమిషనర్లు డీ శ్రీనివాసరావు, సిహెచ్. శ్రీనివాస్ , వెంకట కృష్ణయ్య, సిటి ప్లానర్ రాంబాబు పాల్గొన్నారు.


రమణ యశస్విని అభినందిస్తున్న కార్పొరేటర్ సమత

ప్రభుత్వాసుపత్రిలో త్వరలో 'టైం బ్యాంక్ సేవలు'
● సూపరింటెండెంట్ రమణ యశస్వి వెల్లడి

గుంటూరు మెడికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో రోగులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టైం బ్యాంక్ పేరిట స్వచ్ఛంద సేవలను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. జీజీహెచ్ నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన రమణ యశస్విని శుక్రవారం ఆరవ డివిజన్ కార్పొరేటర్ పోతురాజు సమత, చంద్రశేఖర్ తదితరులు అభినందించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు, రోగుల ఇబ్బందులను వారు సూపరింటెండెంట్ దృష్టికి తెచ్చి వాటిని పరిష్కరించాలని కోరారు. రమణ యశస్వి మాట్లా డుతూ స్వచ్ఛంధ సంస్థలు తమ ఖాళీ సమయాల్లో రోజులో కొన్ని గంటలపాటు ప్రభుత్వాస్పత్రిలో సేవలు అందించవచ్చని తెలిపారు. ఇందు కోసం ముందుగా ఆయా స్వచ్ఛంద సంస్థలు హాస్పిటల్‌లో తమ వివరాలను నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఆయా సంస్థలు జీజీహెచ్‌లో అందించే సేవల సమయాన్ని టైం బ్యాంక్‌లో నమోదు చేసి వారికి గాని, వారి కుటుంబ సభ్యులకు గాని వారి బంధువులకు అవసరమైనప్పుడు ఇతర వాలంటీర్ల ద్వారా సేవలు అందించం జరుగుతుందని తెలిపారు. సూపరింటెండెంట్ ఆలోచనను సమత అభినందించారు. దేవాలయాల్లో, మసీదుల్లో, చర్చిల్లో స్వచ్ఛంధ సేవలు అందించే సంస్థలు, వ్యక్తులు అదే మాదిరిగా పేద రోగులకు ఉపయోగపడేలా ప్రభుత్వాస్పత్రిలో సేవలు అందించేందుకు ముందుకు రావాలని ఆకాంక్షించారు.

మహోన్నత వ్యక్తి సీతారామయ్య


మాట్లాడుతున్న విశ్రాంత డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు, వేదికపై మాజీ ఎంపీ శివాజీ, మాజీ ఎమ్మెల్యే దేవినేని, విష్ణువర్ధన్

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పాటిబండ్ల సీతారామయ్య గొప్ప మనసున్న మహోన్నత వ్యక్తి అని, ఆయన సమాజ సేవకు, విద్య వ్యాప్తికి యనలేని సేవలు అందించాలని విశ్రాంత డిజిపి ఏబి వెంకటేశ్వరరావు తెలిపారు. గుంటూరులో గురువారం పాటిబండ్ల సీతారామయ్య 142 జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్, పాటిబండ్ల సీతారామయ్య ఇరువురి భావాలు ఒకటే అని, ఆనాడు సమాజ నిర్మాణానికి తమ వంతుగా సీతారామయ్య 1920 లోనే 56 ఎకరాల పొలాన్ని ఆచార్య రంగా వ్యవసాయ పరిశోధన సంస్థకు ఇవ్వడం ఆయన దానశీలతకు నిదర్శనం అని అన్నారు. విద్య , వ్యవసాయం పై ఆయనకు మక్కువ అని, గొప్ప దేశభక్తుడని, వారి ఆశయాలకు అనుగుణంగానే ఈ పాఠశాల దేదీప్య మానంగా విరాజిల్లుతోందని అని అన్నారు. అనంతరం పాఠశాల కమిటీ అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు, పాఠశాల పాలకవర్గ కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడారు. ఈ సందర్భంగా వెల్లంకి. లక్ష్మీనారాయణ రావు (రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ), సాయి పాపినేని (చరిత్ర పరిశోధకులు, రచయిత), గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన్ జాతీయ అధ్యక్షులు యలమంచిలి. ధన కోటేశ్వర రావు (కృషీ వలుడు) , పాటిబండ్ల సీతారామయ్య శ్రీపాటిబండ్ల సీతారామయ్య హై స్కూల్ ప్రప్రథమ విద్యార్థి (1962) లను సత్కరించారు. కార్యక్రమంలో పాలకవర్గ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, సభ్యులు మాదల రాజేంద్రప్రసాద్ , కొడాలి నాగ మల్లేశ్వరరావు , మదమంచి రవీంద్ర , గింజుపల్లి వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

'దీపం' పేదల జీవితాలకు మణిదీపం: ఎమ్మెల్యే నసీర్


దీపం- 2 పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నాడు, నేడు ప్రవేశపెట్టిన దీపం పథకం పేదల జీవితాల్లో మణిదీపమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహ మ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలో శుక్రవారం ఆయన దీపం-2 పథ కాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు కట్టెల పొయ్యతో వంట చేస్తూ పడే ఇబ్బందిని గమనించి ఆనాడు దీపం-1 పథకాన్ని ప్రవేశ పెట్టి ఉచితంగా వంటగ్యాసు కనెక్షన్‌ను ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, నేడు పేదలపై వంటగ్యాసు భారాన్ని తగ్గించడానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచి తంగా ఇచ్చే దీపం- 2 పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన వుండి, గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతివారు ఈ పథకానికి అర్హులేనని, నియోజకవర్గంలో 66,709 మంది ఈ పథకానికి అర్హులని తెలిపారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ లక్ష్మి, అసిస్టెంట్ సివిల్ సప్లయర్స్ ఆఫీసర్ వాణి, కార్పొరేటర్లు ఇర్రి ధనలక్ష్మి, ఎల్లావుల అశోక్, పోతురాజు సమత, కూటమి వార్డు అధ్యక్షులు జస్వంత్, సురేష్, రమాదేవి,వాణి, రబ్బాని, శ్రీను నాయక్, బిట్రగుంట్ల మాలిక తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ: శివరామయ్య


టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదులో కంచర్ల శివరామయ్య

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పార్టీకి ప్రాణంగా వుండే కార్యకర్తలకు అన్ని విధాలుగా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య చెప్పారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శివరామయ్య మాటా ్లడుతూ సభ్యత్వం తీసుకునేవారు పార్టీ భవిష్యత్తు కోసం డొనేషన్ కూడా సభ్యత్వంతో పాటు ఇవ్వొచ్చని తెలిపారు. టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కోసం రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి బెల్లంకొండ సురేష్‌ని నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో చిట్టినేని లక్ష్మీనారాయణ, బొబ్బిలి రామారావు, మన్నవ కోటేశ్వరరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ వజ్జా రామారావు, రిటైర్డ్ ఎంఈవో దేవరపల్లి ప్రభుదాస్, వజ్జా శేషారత్నం, కొమ్మతోటి కేజియానల్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి ప్రజాపోరు, ప్రచారయాత్ర
● సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు


మాట్లాడుతున్న రామారావు, పాల్గొన్న నాయకులు

గుంటూరు(తూర్పు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీ ఎం ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 15 వ తేదీ వరకు జరిగే ప్రజాపోరు, ప్రచారయాత్ర, మండల, జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామా రావు పిలుపు నిచ్చారు. స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్ర వారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని, రాజధాని నిర్మా ణాన్ని వెంటనే ప్రారంభించాలని, నిధుల కోసం కేంద్రాన్ని ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న మండల, జిల్లా కలెక్టర్ కార్యాలయ వద్ద జరిగే ధర్నాలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఈమని అప్పారావు, బైరగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పుతోనే అనారోగ్యం


వైద్య శిబిరంలో డాక్టర్ షమా సుల్తాన

గుంటూరు మెడికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేటి జీవనశైలిలో వస్తున్న మార్పులతో పలువురు అనారోగ్యం బారిన పడుతున్నట్లు హోప్‌విన్ హాస్పిటల్స్ ఛైర్ పర్సన్, గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తాన తెలిపారు. హోప్ విన్ హాస్పిటల్స్ నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాల్లో భాగంగా మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి సహకారంతో శుక్రవారం పేరేచర్ల సమీపంలోని దర్గా వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. షమా సుల్తాన మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఉచిత వైద్య శిబిరంలో సుమారు 150 మంది ఆరోగ్య పరీక్షలు చేయించు కున్నారు. మందులు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సిరాజ్, ఖాజావలి, మహ్మద్ పర్వేజ్, ఆసుపత్రి మేనేజర్ పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గురుదాస్ దాస్ గుప్తా పోరాటాలు చిరస్మరణీయం

గుంటూరు(తూర్పు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి గురుదాస్ దాస్ గుప్తా చేసిన పోరాటాలు చిరస్మరణీయమని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ ఓబులేశు అన్నారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం, ఏఐటీయూసీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీ గురుదాస్ దాస్ గుప్తా సంస్మరణ సభను స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగంభవన్ లో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, జంగాల అజయ్ కుమార్, మేడా హనుమంతురావు, అకిటి అరుణ్‌కుమార్, చల్ల చిన్న ఆంజనేయులు, బందెల రవికుమార్, కోట మాల్యాద్రి, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి: ఎమ్మెల్యే మాధవి
● ఎమ్మెల్యే సిఫార్సుతో 10 మందికి రూ. 15 లక్షలు మంజూరు


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యాలు పాలై ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం వంటిదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స చేయించుకొని, ఆర్థి కంగా నష్టపోయిన 15 మందికి శుక్రవారం ఆమె తన కార్యా లయంలో సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న బాధితులు తమను ఆదుకోవాలని తనను కోరగా, వారి పేర్లను సీఎం సహాయ నిధికి సిఫార్సు చేశానని, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి వారికి సహాయ నిధిని అందించి బాసటగా నిలిచారని తెలిపారు. నియోజకవర్గంలో పది మందికి రూ.15.04 లక్షలు సహాయనిధి కింద అందించారని చెప్పారు.

డీఆర్‌వోగా ఖాజావలి బాధ్యతలు స్వీకారం


డీఆర్వో షేక్ ఖాజావలికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగ సంఘ సభ్యులు

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన రెవెన్యూ అధికారిగా ఎస్ ఎస్‌కే ఖాజావలి బాధ్యతలు స్వీకరించారు. పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న ఆయనను ప్రభుత్వం ఇటీవలే గుంటూరు డీఆర్‌వోగా నియమించింది. ఖాజా వలి శుక్రవారం కలె క్టరేట్‌కు వచ్చి జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఖాజావలి గతంలో మచిలీపట్నం, ఏలూరు రెవెన్యూ డివిజనల్ అధికారిగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

డీఆర్వోను కలిసిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

గుంటూరు(తూర్పు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన షేక్ ఖాజావలిను కలెక్టరేట్‌లో ఆయన కార్యా లయంలో ఏపీఎన్జీవో అసోసియేషన్ సంఘ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. డీఆర్వోను జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సభ్యులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసింది.


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రేణుక,హాజరైన అధికారులు

అపార్ నమోదులో అథమ స్థానంలో గుంటూరు జిల్లా

● నమోదులో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
● సమావేశానికి రాని ప్రైవేటు స్కూల్స్‌కు నోటీసులు
● డీఈవో సీవీ రేణుక

గుంటూరు(విద్య),నవంబరు 1(ఆంధ్ర జ్యోతి): అపార్ (ఆటోమెటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు విషయంలో పాఠశాలల యాజమాన్యాలు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, నమోదులో జిల్లా 22వ స్థానంలో ఉండటం విచారకరమని డీఈవో సీవీ రేణుక స్పష్టం చేశారు. వెంకటేశ్వర విజ్ఞాన్ మందిరంలో శుక్రవారం అపార్ నమోదుపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులు వారి పిల్లల ఆధార్‌లో తప్పులుంటే సరిచేసుకునేలా చైతన్యం తేవాలన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అపార్ నమోదులో ఏవైనా సమస్యలుంటే వెంటనే విద్యాశాఖ ఐటీ సెల్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో పీ వెంకటేశ్వరరావు, తూర్పుపశ్చిమ ఎంఇవోలు రమణరావు, ఎంఎం ఖుద్దూస్, ఉర్దూ డీఐ ఎస్‌కెఎండీ ఖాసిం, ఐటీసెల్ సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉంటే సమావేశానికి గైర్హాజరైన 16 పాఠశాలల యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వాలని డీఈవో ఆదేశాలు జారీ చేశారు.

అపార్ నమోదుతో అటకెక్కిన బోధన: యూటీఎఫ్

గుంటూరు(విద్య),నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అపార్(ఆటోమెటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)లో విద్యార్థుల వివరాలు నమోదు వల్ల బోధన అటకెక్కుతుందని యూటీఎఫ్ అధ్యక్ష,కార్యదర్శిలు బీ ఆదిలక్ష్మి, ఎం కళాధార్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు ఎం.హనుమంతరావు, జీ వెంకటేశ్వరరావు, బురాన్,ఎం నరసింహారావు, సిహెచ్ బుజంగరావు తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ స్కూల్స్‌లో ఖాళీ పోస్టులు భర్తీ చేయండి: ఎన్‌టీఏ


గుంటూరు(విద్య),నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ, మున్సిపల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బీ హైమారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డీఈవో సీవీ రేణుకకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఖాళీలు భర్తీకాక పోవడంతో పాఠశాలల్లో బోధన ఇబ్బందిగా మారిందని, ఉన్న టీచర్లపై భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల్లో హెచ్‌ఎం, ఎస్‌ఏ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. ఎయిడెడ్ స్కూల్స్‌లో పదోన్నతులు కల్పించి ఖాళీలు భర్తీ చేయాలని జిల్లా కార్యదర్శి ఎన్‌వి జగదీష్ బాబు విజ్ఞప్తి చేశారు. అనంతరం డీఈవోను సంఘం నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

ఆలయాలకు కార్తీక శోభ

- శనివారం నుంచి కార్తీకమాసం ప్రారంభం
- వేడుకలకు ముస్తాబవుతోన్న ఆలయాలు
- కోటప్పకొండలో కార్తీక మాస పథకానికి విశేష స్పందన
- కాకానిలో నిత్య హోమాలు, రుద్రాభిషేకానికి ప్రత్యేక ఏరాట్లు
- అమరావతిలో కృష్ణమ్మకు హారతులు, తెప్పోత్సవం
- ఆలయాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

పల్నాడుజిల్లా నరసరావుపేట సమీపంలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధి, పంచారామాలలో ప్రథమ ఆరామంగా, దక్షిణకాశీ పుణ్యతీర్థంగా భక్తులచే పూజలందుకుంటున్న అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థానం, గుంటూరు జిల్లా, పెదకాకాని మండల కేంద్రంలోని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానాల్లో శనివారం నుంచి కార్తీకమాస పూజలు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలు కార్తీకమాస వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. అధికారులు, నిర్వాహకులు ఆలయానికి తరలి వచ్చే భక్తుల కోసం ఆయా ప్రాంతాల్లో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. త్రికోటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసంలో స్వామివారికి అభిషేకం చేయటం వలన సర్వదోష నివారణ, సర్వ కార్యసిద్ధి జరుగుతుందని భక్తుల విశ్వాసం. అలాగే కాకాని మల్లేశ్వరుడు కోరిన వరాలు ఇచ్చే దేవుడుగా, అభిషేక ప్రియుడిగా నిత్య పూజలు అందుకోనున్నారు.





కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి మూల విరాట్

మహిమాన్విత క్షేత్రం అమరేశ్వరాలయం

పంచారామాలలో ప్రథమ ఆరామంగాను దక్షిణకాశీ పుణ్యతీర్థంగాను భక్తులచే పూజలందుకుంటున్న అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని సందర్శించే భక్తులకు స్వామివారి దర్శనం సౌకర్యవంతంగా జరిగేలా ప్రత్యేక క్యూలైన్‌లు, మంచినీరు, ప్రసాదాలు పంపిణీ చేయడం జరుగుతుందని దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి పీ. సునీల్‌కుమార్ తెలిపారు. ప్రత్యేకంగా పంచారామాలు దర్శించి భక్తులకు సకాలంలో స్వామివార్ల దర్శనం జరిగేలా పర్యవేక్షిస్తామన్నారు. స్వామివారిని దర్శించుకోలేని భక్తులకు కార్తీకమాసం నెలరోజులు వారి గోత్ర నామాలతో పరోక్షంగా అభిషేకాలు చేసేందుకు రూ1,116 కార్యక్రమం ఉన్నట్లు తెలిపారు. కార్తీకపౌర్ణమి రోజున పవిత్ర కృష్ణమ్మకు హారతులు, స్వామివారి తెప్పోత్సవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పంచారామక్షేత్రాల సందర్శనకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు గుంటూరు రీజనల్ మేనేజర్ రవికుమార్ తెలిపారు.





అమరేశ్వరాలయంలోని ప్రధాన మూడవ ప్రాకారం

నరసరావుపేట, పెదకాకాని, అమరావతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) కోటప్పకొండత్రికోటేశ్వర స్వామి సన్నిధిలో కార్తీక మాసంలో త్రికోటేశ్వర స్వామికి విశేష అభిషేకాలు జరగనున్నాయి. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. కార్తీక మాసం అభిషేక పథకానికి భక్తుల నుంచి మంచి స్పందన లభించింది. నాలుగు వేల మందికి పైగా భక్తులు కార్తీక మాసం అభిషేక పథకంలో సభ్యులుగా చేరారు. ఉదయం 5:30 గంటల నుంచి ఆలయం లో అభిషేకాలు ప్రారంభ మవుతాయి. భక్తులు పరోక్షంగా స్వామి అభిషేకపథకం లో పాల్గొనేందుకు రూ 1,000 టిక్కెట్ చెల్లించాల్సి ఉంది. ఈ పథకంలో చేరితే ప్రతి రోజు స్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ పథకంలో చేరిన సభ్యులకు స్వామి వారి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేస్తారు. కార్తీక మాసం అనంతరం స్వామి ప్రసాదం, శేష వస్త్రం కొరియర్ ద్వారా సభ్యులకు అందజేస్తారు. భక్తులకు ఉచిత దర్శనంతో పాటు రూ 100 స్పెషల్ దర్శనంగా ఏర్పాటు చేశారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు ఉచిత ప్రసాదం అందజేస్తారు. ఆలయంలో నిత్యాన్నదాన పథకం అమలు జరుగుతున్నది. మధ్యాహ్నం 12:30 గంటల నుంచి 3 గంటల వరకు అన్నపూర్ణ సత్రంలో అన్నదానం చేస్తారు. కార్తీక మాసంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా ఆయా పనులను ఈవో డీ చంద్ర శేఖరరావు పర్యవేక్షిస్తున్నారు. స్వామి దర్శనం అనంతరం భక్తులు ఘాట్ రోడ్డు మార్గంలో ఉన్న పర్యాటక కేంద్రాన్ని సందర్శించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆది, సోమవారం, పౌర్ణమి, ఏకాదశి రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని అంచనా వేస్తూ దేవస్థానం ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయనున్నది. నరస రావుపేట, చిలక లూరిపేట డిపోల నుంచి ఆర్టీసి బస్సులను కొండకు నిర్వహించను న్నారు. పోలీసు శాఖ భద్రతా చర్యలు చేపట్టింది.



అమరేశ్వరాలయంలోని ప్రణవేశ్వరుడు

మల్లేశ్వర స్వామికి నిత్య హోమాలు..

పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ అధికారి, ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కార్తీక మాస శుద్ధ పాడ్యమి నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకు ఆలయంలో ఉదయం 8:30 గంటలకు మహన్యాస పూర్వక రుద్ర జప, రుద్రహోమం, ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించనున్నారు. రూ. 2000 పరోక్ష అభిషేక పథకాన్ని అధికారుల ప్రవేశపెట్టారు. చెల్లించిన వారికి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నవంబరు 26న భక్తులచే సామూహిక లక్ష బిల్వార్చన, 29న మాస శివరాత్రి రోజు పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, డిసెంబరు 1న కార్తీక అమావాస్య ఆదివారం రాహు, కేతు పూజలు విశేషంగా నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో గోగినేని లీలా కుమార్ తెలిపారు.





పెదకాకాని మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం



ఎండీయూ వాహనంలో బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

రేషన్ బియ్యం పక్కదారి

- తహసీల్దార్ రాకతో ఎండీయూ ఆపరేటర్ పరార్
- 450కేజీలు (తొమ్మిది బస్తాలు) వ్యత్యాసం
- విచారణ అనంతరం చర్యలు చేపడతామన్న తహసీల్దార్
- పేదల రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తెనాలి రూరల్, నవంబరు 01(ఆంధ్రజ్యోతి): పేదలకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే విధానాన్ని పరిశీలించేందుకు వచ్చిన తహసీల్దార్ రాకను గమనించి ఎండీయూ (రేషన్ పంపిణీ వాహనం) ఆపరేటర్ స్టాక్‌ను విడిచి పరారయిన సంఘటన తెనాలిలో చోటుచేసుకుంది. శుక్రవారం నుండి కార్డు దారులకు రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు లబ్ధిదారులకు చేరువచేసే విధానాన్ని మండల తహసీల్దార్ గోపాలకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంపిణీ ప్రారంభమైన గంట వ్యవధిలోనే చినరావూరు 08నెంబరు ఎండీయూ వాహనంలో సుమారు 9 బస్తాల్లో కేజీలు 450 బియ్యాన్ని అధికంగా ఉన్నట్లు గుర్తించారు. దీనిపై ఆపరేటర్‌ను ప్రశ్నించేందుకు ప్రయత్నించగా అప్పటికే వాహనాన్ని విడిచిపెట్టి ఆపరేటర్ వెళ్లిపోయాడు. అనంతరం అదే ప్రాంతంలో రేషన్ డీలర్ పాయింట్‌ను సందర్శించి స్టాక్ వ్యత్యాసంపై వివరణ ఇవ్వాలని తహసీల్దార్ ఆదేశించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ పేదలు ఆకలితో ఉండకూడదన్న సదుద్దేశంతో ప్రభుత్వం కేజీ రూ.46 బియ్యాన్ని కొనుగోలు చేసి రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు అందిస్తుందని చెప్పారు. అయితే కొందరు దళారులు ఆ బియ్యంపై లేని పోని అపోహలు కల్పించి లబ్ధిదారులు వాటిని వాడకుండా కేజీ రూ.8 నుండి 12 వరకూ కార్డు దారులకు చెల్లించి కొనుగోలు చేస్తూ నల్లబజార్లకు తరలిస్తున్నారని చెప్పారు. దీని ద్వారా కార్డుదారుడు తీవ్రంగా నష్టపోతున్నారని గుర్తించాలన్నారు.ప్రభుత్వం పేదలు సద్వినియోగం చేసుకునేలా ఆహార భద్రతా నియమాలను పాటిస్తూ నాణ్యమైన బియ్యాన్ని ఇస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొందరు ఎండీయూ ఆపరేటర్లు ప్రభుత్వ ఆశయాన్ని నీరు గార్చేలా వ్యవహరిస్తున్నారని నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. స్టాక్ వ్యత్యాసం గుర్తించిన ఎండీయూ ఆపరేటర్‌పై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. రేషన్ పంపిణీపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని నిర్ణిత సమయం లోపు లబ్ధిదారులకు రేషన్ పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. సీఎస్‌డీటీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం



కార్తీకానికి సూర్యలంక సిద్ధం

- భక్తుల తాకిడికి తగ్గట్లు ఏర్పాట్లలో విఫలం
- తాత్కాలిక వసతులతో సరి పెట్టనున్న అధికారులు

తీరంలో దాతల సహకారంతో నిర్మించిన పోలీసు వాచ్‌టవర్





సూర్యలంక తీరంలోని చాలిచాలని స్నానాల గదులు

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పడి లేచే సముద్రకెరటాలు.. ఇసుక తిన్నెలు.. తెరచాప పడవలు, కన్యాకుమారిని తలపించేలా సూర్యోదయంతో, బాపట్ల సూర్యలంక తీరప్రాంతం. పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తూ ఆంధ్ర గోవాగా ప్రసిద్ధి చెందింది. కార్తీకమాసంలో ఇక్కడకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇంతటి ప్రసిద్ధిగాంచిన సూర్యలంక తీరంలో మాత్రం భక్తులకు, పర్యాటకులకు కావాల్సిన వసతులు కల్పించలేకపోయారు. కేవలం వ్యాపార సముదాయాలు పెంచుకోవటమే కాని భక్తుల అవసరాలను మాత్రం గుర్తించి తగిన వసతులు కల్పించటంలో పాలకులు విఫలమయ్యారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది పర్యాటకుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉందనే అంచనాలతో, ఇప్పటికే సమీక్షలు జరిపారు. భక్తులకు కావాల్సిన తాత్కాలిక వసతులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఏటా తాత్కాలిక వసతులు మినహా, శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కానరావడం లేదు. వైసీపీ పాలనలో అప్పటి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్కే. రోజా రెండు సార్లు ఇక్కడకు వచ్చి పరిశీలించి అభివృద్ధి చేస్తామంటూ ఇచ్చిన హామీలు కాస్తా నీటి మూటలాగనే మిగిలిపోయాయి. సముద్రంలో జరుగుతున్న ప్రమాదాలను పసిగట్టేందుకు పోలీసు అధికారులు మాత్రం దాతల సహకారంతో మూడు వాచ్‌టవర్‌లు నిర్మించారు. మంతెన దశరథమహరాజు దాతల సహకారంతో తీరంలో శివాలయం నిర్మించారు. ఈరెండు మినహా ఇక్కడ జరిగిన అభివృద్ధి శూన్యమని చెప్పవచ్చు. గతంలో మాజీ ఎమ్మెల్యే ముప్పలనేని శేషగిరిరావు పర్యాటకులు, భక్తుల కోసం దుస్తులు మార్చుకునేందుకు రెండు భవనాలను నిర్మించారు. వైసీపీ పాలనలో పాలకులు అభివృద్ధి పేరిట వాటిని తొలిగించి ఎలాంటి వసతులు కల్పించలేకపోయారు.

ప్రభుత్వం నుంచి నిధులు నిల్..

లక్షలాది మంది భక్తులొచ్చే ఈప్రాంతంలో కేవలం నాలుగు స్నానాలు గదులు మాత్రమే ఉన్నాయి. వీటిని కూడా వేలంపాట పెట్టి పంచాయతీవారు ఆదాయం సమకూర్చుకుంటూ మెరుగైన వసతులు కల్పించలేకపోతున్నారు. తీరానికి వచ్చే వాహనాల పార్కింగ్, స్నానాల గదుల ఆశీలు వసూళ్లకు పంచాయతీ వేలం ద్వారా, 36.06 లక్షల రూపాయల ఆదాయం వచ్చింది. తీరంలో ఉన్న 38షాపుల ద్వారా 11.40 లక్షల రూపాయలు ఆదాయం వస్తుంది. అయితే గజ ఈతగాళ్ళు, పారిశుధ్య కార్మికులకు ఈ ఆదాయం నుంచే వేతనాలు చెల్లిస్తున్నారు. పారిశుధ్య సామగ్రి, విద్యుత్తు, ఇతర అవసరాలకు కూడా ఈడబ్బులే ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వంనుంచి ఎటువంటి అదనపు నిధులు రావటంలేదని అధికారులు పేర్కొంటున్నారు. దీనివల్ల పంచాయతీ ద్వారా వచ్చే ఆదాయం కాస్తా ఇతర అవసరాలకు వినియోగించాల్సి రావడంతో, భక్తులకు వసతులు కల్పించటంలో విఫలమవుతున్నారు.



సూర్యలంక తీరంలో దాతలు నిర్మించిన శివాలయం.



తీరంలో తొలగించిన పర్యాటకులు దుస్తులు మార్చుకునే భవనాలు.

నేడు ప్రపంచ బ్యాంకు

ప్రతినిధుల బృందం సమావేశం

తుళ్లూరు, నవంబరు 1: (ఆంధ్రజ్యోతి): ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం శనివారం మండల కేంద్రం తుళ్లూరులోని హెచ్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో సమావేశం కానుంది. పర్యావరణం, సామాజిక వ్యవస్థల మదింపు ముసాయిదాపై స్థానిక ప్రజానీకంతో సంప్రందింపులు చేసే కార్యక్రమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని సీఆర్డీఏ అధికారులు శుక్రవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. రాజధాని అమరావతి నగర అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈసమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

తెనాలి క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదని తల్లిదండ్రుల ముందే యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చినరావూరులో చోటు చేసుకుంది. వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు చినరావూరుకు చెందిన గౌస్ ఖాజా మద్యానికి బానిస అయ్యాడు. తరచూ మద్యం సేవించి డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధింపులకు గురి చేస్తుంటాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో మద్యం తాగడానికి డబ్బు కావాలంటూ తల్లిదండ్రులను వేధించసాగాడు. ఎంతకు తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వకపోవడంతో వారిని బెదిరించడానికి ఆత్మహత్య చేసుకుంటానంటూ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కొద్దిసేపటికి తల్లిదండ్రులు తలుపులు పగలగొట్టి చూడగా ఖాజా అప్పటికే చీరతో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

రెస్టారెంట్‌పై రౌడీషీటర్ దాడి

- ఎమ్మెల్యేతో మాట్లాడండి.. లేకుంటే వ్యాపారం జరగదు
- బార్ నిర్వాహకులను హెచ్చరించిన దుండగులు
- తనకు ఏ సంబంధం లేదన్న ఎమ్మెల్యే అరవిందబాబు
- పోలీసులకు ఫిర్యాదు.. ఎట్టకేలకు అరెస్టు

నరసరావుపేట లీగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్, టీడీపీ అధికార ప్రతినిధి చల్లా సుబ్బారావు గురువారం రాత్రి తన అనుచరులతో వినుకొండ రోడ్డులోని బార్‌వన్ రెస్టారెంట్‌పై దాడిచేసి భయోత్పాత వాతావరణం సృష్టించారు. భయపడిన బార్ నిర్వాహకులు రెండవ పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కూడా ఈ రౌడీ మూక అరచాకాన్ని వీక్షించారేకాని ఏవిధమైన చర్యలు తీసుకోలేక పోయారు. దాడి చేస్తున్న సమయంలో నిర్వాహకులను ఎమ్మెల్యేతో మాట్లాడమని, లేని పక్షంలో వ్యాపారం నిర్వహించుకోలేరని తనకు తానే ఎమ్మెల్యేకి సంబంధం లేకపోయినా ప్రగల్భాలు పలుకుతూ దాడి చేశారు. నిర్వాహకులు పోకా శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాము బార్ లైసెన్స్‌ల కోసం రూ 2.90 కోట్లు వెచ్చించి 145 దరఖాస్తులు చేసి ఐదుషాపులు దక్కించుకున్నామన్నారు. అయినప్పటికీ అధికారపక్ష నాయకులు వేధింపులు భరించలేక ఒప్పందంలో భాగంగా ఒక షాపును ఇచ్చేశామన్నారు. ఐనా కూడా వ్యాపారంలో ఓ స్థాయిలో ఉన్న తమ పట్ల టీడీపీకి చెందిన వారు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇక పట్టణంలోని సామాన్య వర్తకుల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో తలచుకుంటేనే భయం వేస్తుందన్నారు. ఈ విషయాన్ని శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దృష్టికి తీసువెళ్ళారు. ఆయన సూచనల మేరకు రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రధాన నిందితుడు రౌడీషీటర్ చల్లా సుబ్బారావును అరెస్ట్ చేసినట్లు రెండవ పట్టణ సీఐ హైమారావు తెలిపారు. మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయన్నారు. కాగా ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు ఈ ఘటనతో తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. చట్టాన్ని ఉల్లఘించి ప్రవర్తించే వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

YouTuber

వినోదం.. సందేశం అన్నీ.. అర నిమిషంలోనే !

వేడి వేడి అన్నంలో టమాటా పప్పు.. రోటి పచ్చడి.. నెయ్యి వేసుకొని తింటే ఎంత సంతృప్తి కలుగుతుందో మల్లాది దుర్గా మల్లేష్ షార్ట్ వీడియోలు చూస్తే అదే అనుభూతి కలుగుతుంది. అందులో అశ్లీలత ఉండదు. ప్రమోషన్‌లు అసలే ఉండవు. కుటుంబమంతా కూర్చుని సినిమా చూసినట్లుగా చక్కగా చూడవచ్చు. కేవలం రెండేళ్లలో సుమారు 7 లక్షల మంది సబ్ స్క్రైబర్ లు. 22 కోట్ల వీక్షణలు. లక్షల్లో ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఫాలోయర్స్. ఇదీ గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన యూట్యూబర్ మల్లాది దుర్గా మల్లేష్ ప్రస్థానం..

గుంటూరు సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరి కి చెందిన మల్లాది దుర్గా మల్లేష్ అంటే కొత్తగా యూట్యూబ్ లో అడుగుపెట్టే వారికి ఒక ఐకాన్. నేటి స్మార్ట్ ఫోన్.. యూట్యూబ్ ప్రపంచంలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్న మల్లేష్ ప్రస్థానం గురించి తన మాటల్లోనే..



దుర్గా మల్లేష్

నేను పెద్దగా చదువుకోలేదు. కానీ కథలు రాయటం అంటే ఎనలేని ఆసక్తి.2010 నుండి కథలు రాస్తూనే ఉన్నా. వాటిని మా స్నేహితులతో కలిసి షార్ట్ ఫిల్మ్ లా తీసేవాళ్లం. కానీ అవి చాలా మంది కి చేరేవి కావు.యూట్యూబ్ వచ్చాక కొన్ని వీడియోలు చూస్తుంటే వ్యూస్ కోసం అశ్లీలత, బూతులు ఇలాంటి వాటిని చూసి ఫ్యామిలీ సందేశంతో చేస్తే ఎలా ఉంటుంది అన్న ఆలోచన వచ్చింది.ఫ్యామిలీ కి సంబంధించినవి చేస్తే ఎవరు చూస్తారని చాలా మంది నిరుత్సాహ పరిచారు.కానీ నేను అటువంటి మార్గం లోనే వెళ్లాలని నిర్ణయించుకున్నా. 2022 జూన్‌లో మల్లాది దుర్గా మల్లేష్ అనే పేరు తో యూట్యూబ్ ఛానల్ మొదలు పెట్టా. నా వీడియోలన్నీ కుటుంబ విలువలు బోధించేవే. ఒక తండ్రి పిల్లలతో ఎలా ఉండాలి.. పిల్లలు తండ్రి తో ఎలా ఉండాలి.. అలాగే భర్త భార్య తో..భార్య భర్త తో ఎలా ఉండాలి అనే విషయాల చుట్టూ తిరుగుతూ ఉంటాయి.నా భార్య, పిల్లలు అందరూ నా వీడియో ల్లో హీరోలు, హీరోయిన్‌లు.

ప్రారంభంలో అనుభవాలు ..

వీడికేమి పోయే కాలం.. సంప్రదాయబద్ధమైన కుటుంబ లో పుట్టి ఇవేం పాడుపనులు..హవ్వ.. వేదం నేర్చిన నోట.. ఈ మాటలు ఏమిటీ.. ఈ యాక్షన్ లు ఏమిటీ... మొదట్లో ఇలా ఎవరి నోటికి వచ్చినట్లు వాళ్ళు మాట్లాడారు.యూట్యూబ్ వీడియోలు చేస్తున్నానని ఊరి వాళ్ళ గోల తట్టుకోలేక మా నాన్న కూడా మాట్లాడటం మానేశాడు.నాలుగు రోజులు నాతో అసలు మాట్లాడలేదు. ఆయన కు ఇష్టం లేని పని ఎందుకు చేయాలని నేను కూడా ఫోన్ పక్కన పడేశా. అప్పటికే దుర్గమ్మ తల్లి మహత్యం మీద చేసిన వీడియో బాగా వైరల్ అయ్యింది. ఆ వీడియోని రెండు కోట్ల మంది చూశారు. మా నాన్న స్నేహితులు చాలా మంది దాన్ని వాట్స్ యాప్‌స్టేటస్ గా పెట్టుకున్నారు. భోజనం చేస్తూ దాన్ని చూసిన నాన్న నా దగ్గరకు వచ్చి శభాష్ రా..అన్నాడు.నాకు అర్థం కాలేదు. ఆ తర్వాత అదే వీడియో ఆయనస్టేటస్ లో పెట్టుకున్నారు. సక్సెస్ వచ్చిన తరువాత మొదట్లో తప్పు గా మాట్లాడిన వాళ్ళంతా నోటి మీద వేలేసుకున్నారు.



యూట్యూబ్ మేకింగ్ వీడియోలో మల్లేష్ కుటుంబం

ఒక వీడియోకి ఎంత సమయం పడుతుంది

మేము తీసే వీడియో నిడివి కేవలం అర నిముషం మాత్రమే. కానీ దాన్ని మంచి సందేశం తో తీయటానికి సుమారు నాలుగైదు గంటలు పడుతుంది. కానీ నేను వారానికి రెండు రోజులు మాత్రమే వీడియో లు చేస్తా. ప్రతి బుధవారం, ఆదివారం మాత్రమే. మిగిలిన రోజుల్లో వాటి జోలి అసలు పోము. మంగళగిరి పానకాల స్వామి గుడి వద్ద ఉన్న పూజా సామాగ్రి షాపును చూసుకుంటా.

యూట్యూబ్ వల్ల గుర్తింపు..

ఒకప్పుడు నాది చాలా చిన్న కుటుంబం.కానీ ఇప్పుడు నాది లక్షలాది మంది కలిగిన కుటుంబం. నన్ను అభిమానించే వాళ్ళు. నేను అభిమానించే వాళ్ళు.ఏ కష్టం వచ్చినా ఒకరికి ఒకరంఅంటూ స్పందిస్తూ ఉంటే .ఇదంతా కేవలం యూట్యూబ్ ప్లాట్ ఫారం వల్లే.ఎక్కడో ఉన్న వాళ్ళ ను ఒక కుటుంబం గా చేసింది. చాలా మందికి ఇబ్బందులు వచ్చాయి.నేను ఒక్కడినే కాదు. వాళ్ళ కోసం మా కుటుంబంలో చాలామంది స్పందించారు. మాకు చేతనైనంత చేశాను. మెదక్ జిల్లాకు చెందిన ఒక సబ్ స్క్రైబర్ రైతు.ట్రాక్టర్ మీద నుంచి కింద పడి చేయి విరిగింది. ఫోన్ చేశాడు. అందరం అంతో ఇంతో సహాయం చేశాం. కరోనా వచ్చి క్వారంటైన్ కి వెళ్లి వాళ్ళు మానసికంగా కుంగిపోకుండా ఉండేందుకు గంటకు ఒకరి చొప్పున వాళ్ళ కి ఫోన్ చేసి మాట్లాడే వాళ్ళం.

ప్రమోషన్ వీడియోలు చేస్తారా..

డబ్బు సంపాదన కు నేను వ్యతిరేకం.చాలా మంది వస్తారు ప్రమోషన్ వీడియో లు చేయమని. అలా చేస్తే నెలకు లక్షల్లో ఆదాయం వస్తుంది. నాకు అది ఇష్టం లేదు. నేను చేస్తున్న వీడియో లకు యూట్యూబ్ నుంచి ఎంతో కొంత వస్తుంది. అది చాలు నాకు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు



విజేతగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌ఆర్‌ఎం ప్రతినిధులు

సౌత్ జోన్ బ్యాడ్మింటన్ విజేత ఏపీ ఎస్‌ఆర్‌ఎం

● ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక

మంగళగిరి సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో అక్టోబరు 28 నుంచి 31వ తేదీ వరకు జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ టోర్నీలో ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ జట్టు విజేతగా నిలిచింది. గత నాలుగేళ్లుగా ఈ కప్‌ను చెన్నై ఎస్‌ఆర్‌ఎం జట్టు కైవసం చేసుకుంటుండగా, ఈ ఏడాది ఏపీ ఎస్‌ఆర్‌ఎం జట్టు చేజిక్కించుకుంది. ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 120 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఏపీ బ్యాడ్మింటన్ టీం కెప్టెన్ రుశేంద్ర సారధ్యంలో తుమ్మల సాయి హర్షిత్, గొల్లపల్లి సాయి మనీష్, శ్రీమోహిత్, శ్రీసాయి, చరణ్ గణేష్, షేక్ నుమైర్‌లు అద్భుత ప్రతిభ కనబర్చారు. వరుసగా మూడు రోజులపాటు జరిగిన ఆరు మ్యాచ్‌లలో తమిళనాడుకు చెందిన నిట్టే యూనివర్సిటీ, మధురై కామరాజ్ యూనివర్సిటీ, పెరియర్ యూనివర్సిటీలతో పాటు కేరళకు చెందిన మహాత్మాగాంధీ యూనివర్సిటీ జట్లపై విజయం సాధించిన ఏపీ ఎస్‌ఆర్‌ఎం జట్టు ఫైనల్‌లో చెన్నై ఎస్‌ఆర్‌ఎం జట్టుతో తలపడి మూడు పాయింట్ల తేడాతో ట్రోఫీని సొంతం చేసుకుంది. దీంతో రాజస్థాన్‌లో త్వరలో జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. విజేతలుగా నిలిచిన ఏపీ ఎస్‌ఆర్‌ఎం జట్టు సభ్యులను వర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ పీ.సత్యనారాయణన్, వైస్ చాన్సలర్ మనోజ్‌కుమార్ అరోరా, స్పోర్ట్స్ డైరెక్టర్ ధీరజ్ పెరాశర్లు, శ్రీపతి తదితరులు అభినందించారు.

కేఎల్‌యూలో జెండర్ సెన్సిటైజేషన్ అంశంపై అవగాహన సదస్సు

తాడేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ ఆధ్వర్యంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం శుక్రవారం కెఎల్ యూనివర్సిటీలో జెండర్ సెన్సిటైజేషన్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన హైకోర్టు న్యాయవాది పోలిశెట్టి సుభాషిణి మాట్లాడుతూ మహిళలను గౌరవించాలని, మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణించే సామర్థ్యం కలవారన్నారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీసీ డాక్టర్ సారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ప్రసాద్, వెంకట్రామ్, రాజశేఖర్‌రావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్‌ఎస్ ప్రసాద్, ఉమన్ ఎంపవర్‌మెంట్ కన్వీనర్ డాక్టర్ రూత్‌రమ్య, కార్యక్రమ కోఆర్డినేటర్ కె విజయరత్నం పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయవాది పోలిశెట్టి సుభాషిణిని సత్కరిస్తున్న చిత్రం

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

తాడేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కుంచనపల్లి, ఇప్పటం, కొలనుకొండ గ్రామాలలో శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కుంచనపల్లికి చెందిన కొలగాని నాగేశ్వరరావుకు రూ.25,166లు, ఇప్పటంకు చెందిన తిరుమలశెట్టి ఆదిశేషమ్మకు రూ.1,62,000లు, కొలనుకొండకు చెందిన బళ్లా భక్తమార్కండేయులుకు రూ.97,461లు చెక్కులను వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో కుంచనపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, ఇప్పటం గ్రామ టీడీపీ అధ్యక్షుడు శంకరశెట్టి పిచ్చయ్య, కొలనుకొండ గ్రామ అధ్యక్షుడు కంచర్ల రంగరావు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ చేస్తున్న అమరా సుబ్బారావు

ప్రకాశం బ్యారేజి దిగువకు 10 వేల 875 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 27,547 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటి పారుదల శాఖ జెఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 15 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి దిగువకు 10,875 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువలకు 8,869 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 7,713 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

తాడేపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు అండ దండ ఏఐటీయూసీ అని ఏఐటీయూసీ నాయకులు కంచర్ల కాశయ్య అన్నారు. గురువారం తాడేపల్లి గేట్ సెంటర్ వద్ద ఉన్న నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఏఐటీయూసీ పతాకాన్ని సీపీఐ సీనియర్ నేత మానికొండ డాంగే ఆవిష్కరించారు. కంచర్ల కాశయ్య మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు, పని గంటలు, పని భద్రత ఉండాలని, భారతదేశ కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి పోరాడి చట్టాలు సాధించిపెట్టిన ఏకైక సంఘం ఏఐటీయూసీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు తుడిమెల్ల వెంకటయ్య, ఖాసిం, బాషా, శీలం శ్యామ్, అనిల్, నడకుడితి లక్ష్మణ, చిన్న, ప్రసాద్, ప్రశాంత్, శివ, కాశీ పాల్గొన్నారు.

నేడు కంటే రంగారావు వర్ధంతి సభ

మంగళగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంఘం నిర్మాత, సీపీఎం నేత కంటే రంగారావు 38వ వర్ధంతి సభను శనివారం మంగళగిరి సీపీఎం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు సీపీఎం పట్టణ కార్యదర్శి కమలాకర్ తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

దుగ్గిరాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామం పెనుమూలిలో జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమై పేద కుటుంబీకులు నిరాశ్రయులయ్యారు. గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ షేక్ అల్లాబక్షు, భార్య తన పిల్లలకు టపాసులు కొనిపెడదామని వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటి నుంచి మంటలు చెలరేగుతున్నాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రమాదవశాత్తూ నిప్పంటుకోవడంతో భార్య కేకలు వేసింది. ఇరుగుపొరుగు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. కుటుంబం కట్టుబట్టలతో మిగిలామని, తమను ఆదుకోవాలని అల్లాబక్షు విజ్ఞప్తి చేస్తున్నాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సీపీఐ నేతకు పరామర్శ



రామారావును పరామర్శిస్తున్న కాశయ్య, డాంగే తదితరులు

తాడేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న సీపీఐ సీనియర్ నాయకులు మునగాల రామారావును శుక్రవారం తాడేపల్లి సీపీఐ నేతలు కంచర్ల కాశయ్య, మానికొండ డాంగే తుడిమెల్ల వెంకటయ్య తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా రామారావు ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆటోలకు పార్కింగ్ స్థలం కేటాయించరూ!

● స్థలం లేక బస్టాండ్‌లోనే పార్కింగ్

● ఇబ్బందులు పడుతున్న ఆటోవాలాలు

తాడికొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాడికొండలో ఆటోలు నిలుపుకునేందుకు తగిన పార్కింగ్ స్థలం కేటాయించాలని ఆటో డ్రైవర్లు, ఓనర్లు దీర్ఘకాలంగా కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో పార్కింగ్ కు స్థలం లేక ఆర్టీసీ బస్టాండ్‌లోనే పార్కింగ్ చేస్తున్నారు. నిత్యం వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే రెండు వందలకు పైగా ఆటోలు రోడ్ల పక్కన పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా ఆర్టీసీ అధికారుల వత్తిళ్లు పెరుగుతున్నాయని ఆటోవాలాలు వాపోతున్నారు. తాడికొండ నుంచి గుంటూరు, మంగళగిరి, తుళ్లూరు, రాజధాని ప్రాంతానికి, బడేపురానికి నిత్యం రెండు వందలకు పైగా ఆటోలు తిరుగుతున్నాయి. కేవలం ప్యాసింజర్ ఆటోలతో పాటు బాడుగా ఆటోల పరిస్థితి ఇదే. కానీ ఆటోలు నిలుపుకునేందుకు స్థలం లేక ఆటోవాలాలు ఇబ్బంది పడుతున్నారు. కొంత మంది పనులు దొరకక డ్రైవింగ్ వృత్తి లో కొనసాగుతున్నారు. ఉపాధి కోసం ఆటోలను నడిపే వారు ఎక్కువగా ఉంటున్నారు. కాని ఆటోలను పార్కింగ్ చేయటానికి సరైన స్థలం లేక, రోడ్డు ప్రక్కల, ఇతర ప్రైవేటు స్థలాల్లో, ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్ చేయటం వలన పోలీసులతో, ఆర్టీసీ వారితో, స్థల యజమానులతో ఇబ్బందులు పడుతున్నామని డ్రైవర్లు వాపోతున్నారు. దీని వలన ఏమి చేయలేని పరిస్థితిలో ఉన్నామని డ్రైవర్లు, ఓనర్లు వాపోతున్నారు. ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా ప్రయోజనం లేదని ఆటో వర్కర్లు అన్నారు. పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని ఆటో యూనియన్ నాయకులు కోరుతున్నారు.



బస్టాండ్ ఆవరణలో నిలిపిన ఆటోలు

టీడీపీతోనే మహిళా సాధికారిత సాధ్యం

● ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



మహిళలకు గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారిత తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం అవుతుందని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. తాడికొండ అడ్డరోడ్డులోని కామాక్షి గ్యాస్ ఏజెన్సీలో దీపం పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 'సూపర్ సిక్స్' పథకంలో భాగంగా మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీని దీపావళి సందర్భంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలో 61,760 మంది లబ్ధిదారులు, తాడికొండ మండలంలో 17,385, తుళ్లూరు మండలంలో 14,745, మేడికొండూరు 14,013, ఫిరంగిపురం మండలంలో 15,617 మంది లబ్ధిదారులు ఉన్నట్లు వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేకపోయినప్పటికీ ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు ప్రజల కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4 వేల పింఛన్ ఇచ్చి మొదటి హామీ నేరవేర్చిందని, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశారని అన్నారు.గత ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటన చేసి రాజధానిని నాశనం చేశారని, అక్కడ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించేందుకు రూ. 36 కోట్లు ఖర్చు అయిందని తెలిపారు. భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కంతేటి బ్రహ్మయ్య మాట్లాడుతూ అధికారులు అలసత్వం వీడి ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు ప్రజలకు చేరువయ్యేలా చూడాలని అన్నారు. 'దీపం' సమాచారం ఇవ్వడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు తలశిల ప్రసన్నకుమార్, ధనేకుల సుబ్బారావు, మల్లిపెద్ది రమేష్, మండవ చిన నరసింహరావు, టీడీపీ కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, టీడీపీ సీనియర్ నాయకులు ఎడ్డూరి హనుమంతరావు, దామినేని శ్రీనివాసరావు, నూతలపాటి రామారావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు పుట్టి రామచంద్రరావు, షేక్ సుభాని, జనసేనపార్టీ నాయకులు యర్రగోపు నాగరాజు, నాగరాజు, గుంటుపల్లి మధుసూధనరావు, యడ్లపల్లి సాంబశివరావు, కంచర్ల సాంబశివరావు, నీలాల కృష్ణారావు, దగ్గుమల్లి శ్రీనివాసరావు, నార్నె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాజలో పథకాన్ని ప్రారంభించిన కూటమి నేతలు

మంగళగిరి సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ పథకంతో ప్రతి ఇంటా వెలుగులు విరజిమ్ముతాయని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య అన్నారు. మంగళగిరి మండలం కాజ గ్రామంలో దీపం-2 పథకాన్ని శుక్రవారం కూటమి నేతలు ప్రారంభించారు. జెండా ఊపి గ్యాస్ సిలెండర్ల వాహనాలను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను అందజేశారు. ఛైర్మన్ అబద్ధయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. దీపం పథకం కింద ప్రభుత్వం ఏటా రూ.2,684 కోట్లను ఖర్చు చేస్తుందని, సిలిండర్ బుక్ చేసుకున్న 48 గంటల్లో రాయితీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతుందని తెలిపారు. టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీతో రాష్ట్ర ప్రజల ఇళ్లలో అసలైన దీపావళి పండుగ జరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, మంగళగిరి పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, నేతలు మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ, మున్నంగి శివశేషగిరిరావు, జంజనం వెంకట సుబ్బారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పల్లపోతుల శ్రీనివాసరావు, జనసేన గ్రామ అధ్యక్షుడు అప్పికట్ల వెంకటరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలెండర్లను పంపిణీ చేస్తున్న కూటమి నేతలు

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

మంగళగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కోసం తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించిన పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని ఏపీ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మంగళగిరి మెయిన్ బజారులోని శ్రీరాములు విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేకల మోహనరావు, గోకవరపు సురేష్, శిందె రామోజీరావు, గార్లపాటి సురేష్, నల్లగొండ పరమేశ్వరరావు, హనుమంతరావు, మురళీకృష్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పేరేచర్లలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

● మేడికొండూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన మహోన్నత వ్యక్తి, అమరజీవి పొట్టి శ్రీరాముల అని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సకలా చంద్రశేఖరు కొనియాడారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పేరేచర్ల జంక్షన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సభలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గొబ్బిలం కుమారస్వామి, కొత్తూరి మోహన్, నూకల రమేష్, బుర్లుమళ్ల వెకంటేశ్వరరావు, కోట సీతారామయ్య, మద్ది రాజేష్, చేగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కాకుమానులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

● కాకుమాను, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాట ఫలితమే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని మండల పార్టీ అధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరి, సంగం డెయిరి మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి అన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా కాకుమానులో ప్రధాన రహదారి వెంట ఉన్న పొట్టి శ్రీరాములు, తెలుగుతల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి టీడీపీ నాయకులు శుక్రవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం అమరజీవి ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాన్ని సైతం కోల్పోయారని తెలిపారు. అటువంటి మహానుభావుల ఆశయ సాధన కోసం టీడీపీ నిరంతర కృషి చేస్తుందన్నారు. పొట్టి శ్రీరాములు వంటి నిస్వార్థ నాయకత్వం నేటి సమాజానికి ఎంతో అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లమోతు పూర్ణచంద్రరావు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పొత్తూరి నాగమల్లేశ్వరరావు, నాగార్జున, పోలిశెట్టి అర్జునరావు, సందీప్, కె ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఛైర్మన్ అబద్ధయ్య, కమిషనర్ అలీం బాషా

మంగళగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను శుక్రవారం తెల్లవారుజాము నుంచే ప్రారంభించారు. ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీం బాషా పింఛన్ల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులకు నగదు సొమ్మును అందజేశారు. లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా నేరుగా ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

● మేడికొండూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరేచర్లలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని మండల పరిషత్ అధికారిణి తోట చందన శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 7 వేల 907 మందికి పెన్షన్‌లు అందజేయాల్సి ఉందని, మెజారిటీ పెన్షన్‌లు తొలిరోజునే పూర్తి చేయాలని ఆమె సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వేలి ముద్రలు తీస్తున్న తీరును పరిశీలించి, నగదును అందించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి పూర్ణ శంకరరావు, జనసేన నాయకుడు బ్రహ్మయ్య పాల్గొన్నారు.



జానకీదేవి దంపతులను సన్మానిస్తున్న మన్నెం రమేష్‌బాబు, అనిత

జానకీదేవికి అభినందనల వెల్లువ

మంగళగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యురాలిగా నియమితులైన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవికి వివిధ రాజకీయ పార్టీల నేతలు, సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు. మంగళగిరి మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ మన్నెం రమేష్ బాబు, అనిత దంపతులు జానకీదేవి దంపతులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీలక్ష్మీనరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జానకీదేవిని ఘనంగా సత్కరించారు. తొలుత సాదు సోడా సెంటరు నుంచి షరాబ్ బజారులోని సొసైటీ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించి జానకీదేవి, రామకృష్ణ దంపతులను ఘనంగా సత్కరించారు. సొసైటీ అధ్యక్షుడు గుంటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో మంగళగిరికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు దామర్ల సతీశ్, కౌతరపు రమేష్, చెరుకు పూర్ణ, జొన్నాదుల బాలకృష్ణ, గుండా గణపతి, నందం ఆదినారాయణ, కారంపూడి చిరంజీవి, పెద్దరాజు, మునగాల శ్రీనివాసరావు, చెల్లారి సత్యనారాయణ, ఆకురాతి నాగేంద్రం పాల్గొన్నారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, నేతలు తాడిబోయిన మహేష్ యాదవ్, బోగి వినోద్, చౌక ధరల దుకాణాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శిరందాసు నాగేశ్వరరావు, తాడేపల్లి అధ్యక్షుడు డి.బ్రహ్మానందం తదితరులు టీటీడీ ధర్మకర్త జానకీదేవికి అభినందనలు తెలిపారు.



టీటీడీ పాలకవర్గ సభ్యురాలిగా నియమితులైన తమ్మిశెట్టి జానకీదేవిని మంగళగిరి టీడీపీ కార్యాలయంలో దుగ్గిరాల మండల టీడీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, పసుపులేటి రవి యాదవ్, గొర్నేని అనిల్ తదితరులు పాల్గొన్నారు. - దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి)

నృసింహుని దర్శించుకున్న జ్యోతిసురేఖ



దేవాలయంలో జ్యోతిసురేఖ

మంగళగిరి సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విలువిద్య క్రీడాకారిణి, పద్మశ్రీ అవార్డు గ్రహీత వెన్నం జ్యోతిసురేఖ శుక్రవారం మంగళాద్రి క్షేత్రాన్ని దర్శించుకున్నారు. దిగువ సన్నిధిలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి, శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రీడా రంగంలో ఆర్చరీలో అత్యున్నత స్థాయికి ఎదిగిన జ్యోతి సురేఖకు గత ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్‌తో సమానమైన గ్రూప్-1 పోస్టింగ్ ఇచ్చింది. విజయవాడలో స్టేట్ ప్రొటోకాల్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టే ముందు జ్యోతిసురేఖ కుటుంబ సభ్యులతో కలిసి మంగళగిరి నృసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గృహ నిర్మాణాల పూర్తికి వంద రోజుల ప్రణాళిక

● దుగ్గిరాలలో గృహ నిర్మాణాలపై డీపీవో సమీక్ష

దుగ్గిరాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం దుగ్గిరాలలోని గృహ నిర్మాణాల లక్ష్యాన్ని వంద రోజుల ప్రణాళికతో పూర్తి చేసేలా గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బంది పని చేయాలని డీపీవో సాయికుమార్ ఆదేశించారు. పింఛన్ల పంపిణీలో తలెత్తుతున్న సర్వర్ సమస్యలపై శుక్రవారం సిబ్బందితో తొలుత మాట్లాడిన డీపీవో తన చేతులమీదుగా కొందరు లబ్ధిదారులకు సామాజిక పింఛన్‌లను పంపిణీ చేశారు. గ్రామంలోని రెండు లేఅవుట్లను పరిశీలించి, గృహనిర్మాణాల లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు సత్వరమే జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానిక నిమ్మగడ్డ ఫౌండేషన్ జడ్పీ బాలురోన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనంతోపాటు, కోడిగుడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ కె.జవహర్‌లాల్‌నెహ్రూ, గృహనిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు, ఏపీవో మధుబాల, ఏపీఎం సురేష్‌కుమార్, ఈఓ వివేకానంద, హెచ్‌ఎం బాలసుందరం, పలువురు పంచాయతీ, సచివాలయ సిబ్బంది సాంబశివరావు, కీర్తి తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాలలో నివేశన స్థలాల లబ్దిదారులకు బిల్లుల చెల్లింపులపై సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో సాయికుమార్

విద్యావ్యవస్థల మధ్య సులభతర బదిలీలు : ఎంఈవో

కాకుమాను, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యావ్యవస్థల మధ్య సులభతర బదిలీలకు ఏపీపీఏఆర్ కార్డులు ఎంతగానో దోహదం చేస్తాయని మండల విద్యాశాఖాధికారి కేఎఫ్ కెన్నడీ అన్నారు. మండల పరిధిలోని కొండపాటూరు ఎంపీయుపీ పాఠశాల, కాకుమానులో ఇండియన్ జెమ్స్ ప్రైవేట్ పాఠశాల, అంబేడ్కర్ గురుకుల(బాలికల) పాఠశాలలను ఎంఈవో-2 విజయ్‌భాస్కర్‌తో కలసి శుక్రవారం పరిశీలించారు. కెన్నడీ మాట్లాడుతూ ఏపీపీఏఆర్ కార్డుల కోసం తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. 12 అంకెల ఈ ఏపీపీఏఆర్ కార్డుల వలన విద్యార్థులు స్కూల్ నుంచి కాలేజి వరకు చదివే ప్రతి విద్యార్థి స్కూల్ ఎడ్యుకేషన్ పోర్టల్‌లో ఆధార్ కార్డుతో సరిపోలి ఉండాలన్నారు. పేరు, జనన ధ్రువీకరణ పత్రం, లింగ నిర్ధారణ వంటి అంశాలు సరిగా ఉండాలని సూచించారు. 9, 10 తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శీలం అంకారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం నుంచి వివరాలు సేకరిస్తున్న ఎంఈవోలు కెన్నడీ, విజయ్‌భాస్కర్

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ : వ్యక్తికి గాయాలు

పెదనందిపాడు, నవంబరు, 1 (ఆంధ్రజ్యోతి) : పెదనందిపాడు - కొప్పర్రు రహదారిలో వరగాని సమీపంలో శుక్రవారం ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... చిలకలూరిపేటకు చెందిన పాశం దుర్గారావు మండల పరిధిలోని అన్నపర్రులో అత్త ఇంటికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టి అదుపుతప్పి పడిపోయాడు. దీంతో తలకు బలంగా గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చినా ఎంతసేపటికి రాకపోవడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ మధుపవన్ పోలీసు వాహనంలో పెదనందిపాడు పీహెచ్‌సీకి తరలించారు. అపస్మారకస్థితిలో ఉన్న క్షతగాత్రుడికి స్టాఫ్‌నర్సు చైతన్య సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పండ్ల దుకాణంలో అగ్నిప్రమాదం

పొన్నూరు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లోని పండ్ల దుకాణం గురువారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతి అయింది. స్థానికుల కథనం ప్రకారం గాంధీబొమ్మ సెంటర్ లోని కాలేషా పండ్ల దుకాణంలో మంటలు చెలరేగి దుకాణంలోని పండ్లు నిల్వచేసే చెక్క పెట్టలు, ప్లాస్టిక్ ట్రేలకు నిప్పు అంటుకొని క్షణాల్లో దుకాణం పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో రూ.50 వేల ఆస్తినష్టం సంభవించినట్లు దుకాణ యజమానులు తెలిపారు.

పన్నులు చెల్లించాలని వచ్చే ఫోన్‌కాల్స్‌ను నమ్మకండి

● కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పన్నులను చెల్లించాలని గుర్తుతెలియని కాల్స్ వస్తున్నాయని వాటిని నమ్మి నగదు చెల్లించవద్దని పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని రోజులుగా పురపాలక సంఘ పరిధిలో పలువురికి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్లుచేసి పురపాలక సంఘానికి పన్నుల రూపేణా బకాయిలు ఉన్నారని తాము చెప్పిన నెంబరుకు ఫోన్‌పే లేదా గూగుల్‌పేలో గాని చెల్లించాలని కోరుతున్నారన్నారు. చెల్లించకుంటే పురపాలక సంఘ చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని బెదిరింపులకు గురిచేస్తున్నారని పలువురి నుంచి ఫిర్యాదులు అందాయని తెలిపారు. పురపాలక సంఘం డిమాండ్ నోటీసుల ద్వారా డోర్ టూ డోర్ అందజేస్తామని, కార్యాలయంలో నగదు చెల్లించి రసీదులు పొందాలని కోరారు. ఆన్‌లైన్ మోసగాళ్ళ పట్ల పురప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెనాలి కోర్టులో డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

తెనాలి క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోర్టులలో ఇటీవల కాలంలో నమోదు అవుతున్న కేసుల్లో ఎక్కువభాగం కూర్చుని మాట్లాడుకుని సామరస్యంగా పరిష్కరించుకోదగినవేనని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు శుక్రవారం పేర్కొన్నారు. రాజీ పడదగిన కేసులు కోర్టు ద్వారా త్వరితగతిన పరిష్కరించుకోవడం కోసం జాతీయ లోక్ అదాలత్ డిసెంబరు 14న తెనాలి కోర్టులో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ లోక్ అదాలత్‌లో అన్నిరకాల సివిల్, భరణం, బ్యాంకు కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చునని న్యాయాధికారి తెలిపారు.

కొమ్మూరి వెంకటలక్ష్మికి డాక్టరేట్


కొమ్మూరి వెంకటలక్ష్మి

పొన్నూరు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన కొమ్మూరి వెంకట లక్ష్మికి కేఎల్ యూనివర్సిటీ ఇంగ్లీష్ సబ్జెక్టులో పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేసింది. ఏ స్టడీ ఆన్ డియాస్పోరిక్ థీసిస్ ఇన్ భారతీ ముఖర్జీస్ సెలెక్ట్ నావెల్స్ అనే అంశంపై రీసెర్చ్ చేసినందుకు వెంకటలక్ష్మి పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ప్రొఫెసర్ సోఫియా ఆధ్వర్యంలో పరిశోధన పత్రాలను సమర్పించారు. వెంకట లక్ష్మి గత 14 సంవత్సరాలుగా ఆర్‌వీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్నారు.

చరిత్ర సృష్టించిన ఇందిరాగాంధీ

తెనాలి అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారత దేశ మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ చరిత్ర సృష్టించారని కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు చెప్పారు. బోసురోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహానికి ఆమె వర్ధంతి పురస్కరించుకుని గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో ఉన్న కుమ్ములాటల నేపథ్యంలో ప్రధాని పదవిని చేపట్టి ధైర్యం, సమయస్ఫూర్తితో పరిపాలన చేశారని చెప్పారు. బ్యాంకులను జాతీయంచేసి పేద ప్రజల అభ్యున్నతికి దోహదపడ్డారని, జమీందారి వ్యవస్థను రద్దు చేసిందన్నారు. ఇతర దేశాలకు సాయం అందించే క్రమంలో అగ్రదేశాలకు ఆగ్రహం వచ్చినా వెరవని ధైర్యశాలిగా పేరు తెచ్చుకుందని చెప్పారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, దారా రామకృష్ణ, ద్వారకా శ్రీనివాసరావు, బుల్లియ్య, స్టీవెన్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



వివాహిత ఆత్మహత్యాయత్నం

తెనాలి క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భర్త అనుమానపు వేధింపులు తట్టుకోలేక భార్య పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన గురువారం కూరగాయల మార్కెట్ రెండో అంతస్తులో జరిగింది. వన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక బాలాజీరావుపేటకు అప్సన ఐదు సంవత్సరాల క్రితం రమేష్‌ని కులాంతర వివాహం చేసుకుంది. వారికి ముగ్గురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు. ఒక మగ పిల్లాడు. రమేష్ పెయింటర్‌గా పని చేస్తుండగా, అప్సన బిర్యానీ పాయింట్‌లో దినసరి కూలీగా పనిచేస్తోంది. గత కొంత కాలంగా రమేష్ భార్యకు అక్రమ సంబంధం ఉందన్న అనుమానంతో తరచూ వేధింపులకు గురిచేస్తున్నాడు. వేధింపులు భరించలేని స్థాయికి చేరడంతో బాలాజీరావుపేటలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. వారం రోజులుగా పుట్టింటిలో ఉన్న అప్సన తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులు కూడా పూటగడవని స్థితిలో ఉండటంతో వారికి భారం కాకూడదనే ఉద్దేశ్యంతో అప్సన ఆత్మహత్య శరణ్యంగా భావించి గురువారం కూరగాయల మార్కెట్ లోని రెండో అంతస్తులోకి వెళ్లింది. దీపావళి పండుగ కావడంతో అక్కడ జన సంచారం లేదు. దీంతో వెంట తెచ్చుకున్న బాటిల్ పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. ఇది గుర్తించిన ఆ ప్రాంతం వారు వెంటనే ఆమెను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికి 50 శాతం కాలిపోవడంతో ఆమెను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందని సీఐ తెలిపారు.

ఆ పొలాలకు వెళ్లాలంటే రైతులకు ప్రాణ సంకటమే

- కొమ్మమూరు కాలువపై బ్రిడ్జిలేక రైల్వే బ్రిడ్జిపై నడక
- 500 ఎకరాల రైతులకు తప్పని తిప్పలు
- బ్రిడ్జి దాటుతూ పలువురు మృతి ● నిరుపయోగంగా బల్లకట్టు
- పంటలు తరలించేందుకు నానా అగచాట్లు
- బ్రిడ్జి నిర్మించి ఆదుకోవాలంటున్న రైతులు


కొమ్మమూరు కాలువపై ఉన్న రైల్వే బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్న రైతులు


నిరుపయోగంగా ఉన్న బల్లకట్టు

తెనాలి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగంజాగర్లమూడిలో కొమ్మమూరు కాలువపై పంట పొలాలకు వెళ్లేందుకు ఎటువంటి బ్రిడ్జి లేకపోవటంతో రైతులకు ప్రాణసంకటంగా మారింది. పంట పొలాలకు వెళుతూ రైతులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. కాలువ రెండు వైపులా పంటపొలాలు ఉన్నాయి. దానికి ఒకపక్క రోడ్డు మార్గంలో సంగమేశ్వర స్వామివారి ఆలయం మీదుగా శేకూరుపాలెం ఇతర గ్రామాలకు చేరేందుకు రోడ్డుమార్గం ఉంది. మరోవైపు డొంక రోడ్డుగా ఉంటూ అది పూడిపోయి రైతులు సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి. ఆ ప్రాంతంలో దాదాపుగా 500 ఎకరాల రైతుల పంట భూములు ఉన్నాయి. వీటిల్లో నిమ్మ, అరటి, ఇతర పంటలను సాగుచేస్తుంటారు. అన్నదాతలు సాగు ప్రారంభం నుండి పూర్తి అయ్యేంత వరకూ ప్రతి రోజు ఆ భూముల వద్దకు వెళ్లి పైర్లను పరిశీలించి సస్యరక్షణ చర్యలు చేపడుతుంటారు. ఐదే ఈ భూములకు వెళ్లాలంటే దాదాపుగా 3100 క్యూసెక్కుల నీరు ప్రవహించే సుమారు 100 నుంచి 120 మీటర్ల వెడల్పు ఉన్న కొమ్మమూరు కాలువ దాటాల్సి ఉంటుంది. దీనిపై ఎటువంటి బ్రిడ్జి లేకపోవడంతో రైతులకు గతంలో ప్రత్యామ్నాయమార్గంగా బల్లకట్టును ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ ఇరిగేషన్ శాఖ అధికారులు చేపట్టేవారు. దీనిపై రైతులు వారి పంట ఉత్పత్తులను తరలించుకోవడం, పైర్లకు అవసరమైన ఎరువులు పురుగుమందులు తీసుకువెళ్లడం వంటివి చేయడంతో పాటు కూలీలు సైతం బల్లకట్టు సాయంతో రాకపోకలు సాగించేవారు. ఇది కాలక్రమేణా నిలిచిపోవడంతో రైతులకు పంట పొలాలకు వెళ్లేందుకు అవకాశంలేకుండా పోయింది. గ్రామం నుండి డొంకమార్గం ఉండగా దాదాపుగా 3 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావల్సి ఉండటం, ఆ మార్గం కూడా రాకపోకలు చేసేందుకు అనువుగా లేకపోవడంతో సంగమేశ్వరస్వామివారి ఆలయం సమీపంలో ఉన్న రైల్వే లైన్ ఉన్న బ్రిడ్జిపై నుండి రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం రైతులు, రైతు కూలీలు ఆ బ్రిడ్జిపై నుండే వెళ్లి వస్తుంటారు. బ్రిడ్జిపై రైల్వేలైను దాని కింద ఉధృతంగా ప్రవహించే కొమ్మమూరు కాలువ ఉండటంతో దాదాపు 100 మీటర్లమేర నడిచే క్రమంలో రైలు వేగంగా వస్తే వారు ప్రమాదానికి గురికాకుండా తప్పించుకునే వీలు లేక రైలు ఢీకొనడమో లేక ఉధృతంగా ప్రవహించే కొమ్మమూరు కాలువలో దూకటం వంటివి చేస్తూ ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు. గతంలో ఎంతో మంది ఆ బ్రిడ్జిపై ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయారని స్థానిక రైతులు తెలిపారు. మరింత మంది ప్రాణాలు కోల్పోకముందే ప్రభుత్వం స్పందించి కొమ్మమూరు కాలువ మీదుగా బ్రిడ్జి నిర్మించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


వంశీసాయి

అధ్వానంగా డొంకమార్గం


రైతు బసవపున్నయ్య

కొమ్మమూరు కాలువ రెండో వైపున ఉన్న పంటపొలానికి చేరేందుకు శేకూరు రోడ్డు నుంచి డొంక మార్గం ఉంది. అయితే దానిని సద్వినియోగం చేసుకునే వారే లేరు. ఇందుకు ప్రధానంగా సంగంజాగర్లమూడి నుంచి శేకూరు మార్గంలో ఉన్న డొంకకు దాదాపుగా మూడు కిలోమీటర్లు తిరిగి రావాల్సి ఉంది. దీనికి తోడు గోతులమయంగా మారింది. బ్రిడ్జి నిర్మిస్తే రైతులకు మంచి జరుగుతుందని రైతు బసవపున్నయ్య కోరుతున్నారు.

పురాతన ఆలయం కూడా ఉంది

వెంకటేశ్వరస్వామి వారి పురాతన ఆలయం కూడా కొమ్మమూరు కాలవ రెండో వైపు ఉంది. ఇక్కడికి భక్తులు శివరాత్రి పర్వదినంలో జరిగే తిరునాళ్లకు పెద్ద ఎత్తున వస్తుంటారు. బల్లకట్టు లేకపోవడం, డొంకమార్గం దూరంగా ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటుంది. ఆలయాన్ని భక్తులు సద్వినియోగం చేసుకునేలా బ్రిడ్జి నిర్మించాలని ఆలయ అర్చకస్వామి నారాయణం కమలాకర్‌బాబు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిమ్మకాయలు తరలించాలంటే ఇబ్బందులే

తమ పంటపొలంలో పండే నిమ్మకాయలను మార్కెట్‌కు తరలించేందుకు ఇబ్బందులు తప్పడంలేదని రైతు వంశీసాయి చెబుతున్నారు. దాదాపుగా క్వింటా బరువుండే బస్తాను నెత్తినపెట్టుకుని రెండోవైపుకు రావాలంటే చెప్పలేనంత ఇబ్బందులు పడుతున్నాం.

కూలీలు కూడా రావడంలేదు

తమ పంటపొలాల్లో పనిచేసేందుకు కూలీలు సైతం కాలువ దాటి రావలన్నభయంతో రావడంలేదని రైతు చింతయ్య చెబుతున్నారు. దీంతో సకాలంలో పంటలకు ఎరువులు, కాపుకొచ్చిన తరువాత నిమ్మపండ్లు, అరటి గెలలు తరలించే పరిస్థితి లేకుండా పోతుందని వాపోతున్నారు. బ్రిడ్జ్ నిర్మించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


తెనాలిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జిల్లా సంఘ నాయకులు

తెనాలి, మారీసుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిసర ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మారీసుపేటలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద శుక్రవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పెండేల సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు గోనుగుంట్ల శ్రీనివాసరావుతో కలసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహా నాయకుడు పొట్టి శ్రీరాములు అన్నారు. వారుచేసిన త్యాగాలు మరువలేమన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సుగ్గల చిన్న, ధరసి అనంత్‌మోహన్, రాము, రామకృష్ణ, బి ఉదయ్, వెంకటరత్నం, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొనారు.

కొల్లిపరలో...


కొల్లిపరలో...

కొల్లిపర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొల్లిపర మెయిన్‌రోడ్డులో ఉన్న పొట్టి శ్రీరాముల విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు, గ్రామ పెద్దలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఆ మహనీయుని త్యాగఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటయ్యిందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడు కాజా సుబ్బారావు, కార్యదర్శి చుండూరు వెంకటరత్నం, ఆర్యవైశ్య సంఘ నాయకులు మునగాల నవీన్, సుగ్గుల సురేష్‌కుమార్, మునగాల శివకోటేశ్వరరావు, బొల్లిశెట్టి హరీష్, కొడూరు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగ ఫలితమే తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైందని ఆర్యవైశ్య సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు బాపనపల్లి ప్రభాకర లక్ష్మీ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సదర్భంగా 58రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షచేసి ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు అమరజీవి పొట్టి శ్రీరాములు పరిరక్షణ సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి తహసీల్దార్ జియావుల్‌హక్ నివాళి అర్పించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. చేబ్రోలు గౌడపాలెం ఎంపీపీ పాఠశాలలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఎంఈవో రాయల సుబ్బారావు, ఉపాధ్యాయులు శ్రీనివాస మూర్తి, నాగేశ్వరరావు, ఉమాదేవి, అన్నామణి తదితరులు పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో హనీష్ ప్రతిభ



పతకాలు సాధించిన హనీష్

తెనాలి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోప్ స్కిప్పింగ్ పోటీల్లో అంగలకుదురుకు చెందిన కనగాల హనీష్ రెండు బంగారు పతకాలు సాధించాడు. ఈ నెల 30, 31వ తేదీల్లో గుంటూరులో నిర్వహించిన సౌత్‌జోన్ నేషనల్ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో హనీష్ పాల్గొని ఓర్పులో బంగారు పతకం, టీమ్ ఈవెంట్‌లో మరో బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి, పలువురు గ్రామ పెద్దలు క్రీడాకారుడిని అభినందించారు. కార్యక్రమంలో పలువురు గణేష్‌యూత్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: ఎంఈవో

కొల్లిపర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం పథకంపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తూములూరు, కొల్లిపర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో ఆకస్మికగా తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం విషయంలో తగిన జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏజెన్సీ నిర్వాహకులు ఆ జాగ్రత్త వహిస్తే తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. విద్యార్థుల ప్రగతిపై ప్రతి నెల తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. పాఠశాలల్లో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి: సహాయ మలేరియా అధికారి

తెనాలి, మారీసుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పట్టణ సహాయ మలేరియా అధికారి ప్రభాకరరెడ్డి కోరారు. స్థానిక సుల్తానాబాదులోని కుమార్ కాలనీలో శుక్రవారం మలేరియా సిబ్బందితో కలసి పట్టణ సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి ఇంటింటికి సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ వారంలో ఒకటి లేదా రెండు సార్లు నీటి నిల్వలను తొలిగించడం వలన దోమ సంతతి అభివృద్ధి చెందకుండా చూడవచ్చన్నారు. ఎవరికైనా వైద్య సహాయం అవసరమైన సమీపంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలలోగాని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలోగాని ఉచిత పరీక్షలతో పాటు మందులను పొందవచ్చన్నారు. మరింత సాయం కోసం ఆశా కార్యకర్తలను గాని, ఆరోగ్య కార్యకర్తలను గాని సంప్రదించాలని కోరారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేస్తు ఫ్రైడే డ్రైడే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి బాలచంద్రమౌళి, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు, బండారు నాగమల్లేశ్వరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీక మాసం... ఆలయాల్లో విస్తృత ఏర్పాట్లు

తెనాలి అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసం శనివారం నుంచి మొదలవుతుంది. పట్టణంలోని ఆలయాల్లో ఇందుకోసం దేవదాయ శాఖాధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు అవసరమైన క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. పట్టణంలో అతి ప్రాచీనమైన పరశురామ ప్రతిష్టిత శ్రీరామేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. గంగానమ్మపేటలో పాత శివాలయంగా పిలుచుకునే ఇక్కడ విశాలమైన ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించేందుకు భక్తులు పెద్దఎత్తున వస్తుంటారు. సోమవారం ఈ తాకిడి మరింత ఎక్కువగా ఉంటుంది. కీలకమైన వ్యాపార దుకాణాల ప్రాంతంలో ఈ ఆలయం ఉండటంతో రహదారి చిన్నది కావడం, ట్రాఫిక్ సమస్య ఎదురవుతూ ఉంటుంది. వందలాది మంది భక్తుల ద్విచ వాహనాలు రోడ్లపైనే పెట్టి వెళ్లడం, ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులు ఈ మార్గంలో రాకపోకలను మళ్లించాల్సి ఉంది. అదే విధంగా వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామి దర్శనం చేసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. రామలింగేశ్వరస్వామి శివాలయం, మారీసుపేట శివాలయంలో కూడా కార్తీక మాసం సందడి నెలకొంటుంది. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తుల తాకిడి అధికంగా ఉండే ఆలయాలలో ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శన రుసుములను నిర్ణయించారు.

తైక్వాండో పోటీల్లో తెనాలి క్రీడాకారుల ప్రతిభ

తెనాలి అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): 4వ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో తెనాలికి చెందిన పలువురు క్రీడాకారులు పతకాలు సాధించారు. జూనియర్, సబ్ జూనియర్, మినీ సబ్‌జూనియర్ పోటీలు ఇటీవల నిర్వహించారు. ఈ పోటీలలో కేఎస్ఆర్ తైక్వాండో అకాడమీ నుంచి పాల్గొన్న 30మంది క్రీడాకారుల్లో 10మందికి బంగారు పతకాలు, 9 మందికి వెండి, ముగ్గురికి కాంస్య పతకాలు లభించాయి. అకాడమీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, కుర్రా శ్రీనివాసరావు, కృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. చెన్నైలో జరగనున్న సౌత్‌ఇండియా చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు పలువురు అర్హత సాధించారని కోచ్ తెలిపారు.

పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ శ్రీనివాసరావు తదితరులు



అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

● త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు



తెనాలి, మారీసుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): త్రీ టౌన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపామని, నేర నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామని త్రీ టౌన్ సీఐ రమేష్‌బాబు ఆంధ్రజ్యోతితో తెలిపారు.



ప్రశ్న: గతంలో త్రీటౌన్ స్టేషన్ పరిధిలో పలు నేరాలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: నైట్ పికెటింగ్‌లను ఏర్పాటు చేశాం. పాత నేరస్థులను తీసుకొని వచ్చి కౌన్సెలింగ్‌లను నిర్వహిస్తున్నాం.

ప్ర: రేషన్ మాఫియాపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: స్టేషన్ పరిధిలో 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి పౌరసరఫరాల శాఖ, విజిలెన్సు అధికారులతో కలసి అనుమానిత ప్రాంతాలలో దాడులు నిర్వహిస్తున్నాం.

ప్ర: గంజాయి అదుపులో ఉందా?

జ: గతంతో పోల్చుకుంటే 90శాతం గంజాయి అదుపులోకి వచ్చింది. మిగిలిన వారిపైన నిఘా ఉంచాం. అనుమానితులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం.

ప్ర: డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ప్రస్తుతం దానిని అరికట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. త్వరలోనే కార్యాచరణను ప్రారంభిస్తాం.

ప్ర: నేర నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేర నియంత్రణకు ప్రత్యేకంగా బాలాజీరావు పేట, మారీసుపేట కబేళా వంతన, చెంచుపేటలలో ప్రత్యేక బృందాలతో పెట్రోలింగ్‌లను నిర్వహిస్తున్నాం. నేర నియంత్రణకు ప్రజలు తమ పరిధిలో జరుగుతున్న అసాంఘీక కార్యక్రమాలు, గంజాయి వినియోగంపై సమాచారం ఉంటే తమకు తెలపాలన్నారు.

పొన్నూరులో 90 శాతం పెన్షన్ల పంపిణీ


పెన్షన్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, సిబ్బంది

పొన్నూరు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచే అధికారులు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వార్డు వార్డు తిరుగుతూ పెన్షన్ల పంపిణీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పట్టణంలో పెన్షన్ల పంపిణీ పరిశీలించగా గ్రామాలో ఎంపీడీవో శ్రీనివాసరావు పర్యవేక్షించారు. తొలిరోజు దాదాపు 90 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి అయినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన పెన్షన్లను రెండోరోజు శనివారం పూర్తి చేయనునట్లు చెప్పారు. ఈ పెన్షన్ల పంపిణీలో కూటమి పార్టీల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కొసరాజు వెంకట్రాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ యలమంచలి శివాజి

కొసరాజు మృతి తీరని లోటు: యలమంచలి శివాజి

పొన్నూరు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొసరాజు వెంకట్రాయుడు మృతి తీరని లోటు అని మాజీ ఎంపి యలమంచలి శివాజి అన్నారు. శుక్రవారం నిడుబ్రోలులోని కొసరాజు వెంకట్రాయుడు గృహానికి యలమంచలి శివాజి విచ్చేసారు. ఈ సందర్భంగా వెంకట్రాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. వెంకట్రాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేసారు. ఈ సందర్భంగా వెంకట్రాయుడితో తనకు ఉన్న అనుబంధాని మననం చేసుకున్నారు. ఆచార్య ఎన్జీరంగా శిష్యులుగా సాగిన తమ అనుబంధాని గుర్తు చేసుకున్నారు. వెంకట్రాయుడు రైతు సంఘం నాయకుడుగా, ఆగ్రో ఇండస్ట్రీస్ మాజీ డైరెక్టర్‌గా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా జయంతోత్సవ కమిటి నాయకులు, నన్నపనేని ప్రభాకరరావు, గోగినేని వెంకటేశ్వరరావు, జానకీ బాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న జాగర్లమూడి సుధీర్ తదితరులు

పొన్నూరు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో విద్యానగర్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు శుక్రవారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ దాతల సహకారంతో సేకరించిన దుపట్లను పంపిణీ చేశారు. నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్ చేతల మీదుగా వృద్ధులకు ఈ దుప్పట్లను అందచేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్, టీడీపీ నాయకులు ఆరే ప్రసాద్, చల్లపలి శోభరాజ్, కర్ర మహేష్, ఎనుముల నన్ని, చిలకపాటి సింహాద్రి, పోలిశెట్టి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఏఐటీయూసీ పతాకాన్ని ఎగరవేస్తున్న ఆరేటి రామారావు, కార్మికులు

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

పొన్నూరు టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ పోరాటాల ఫలితమే కార్మిక చట్టాలు ఏర్పడ్డాయని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు అన్నారు. గురువారం ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం పొన్నూరు పట్టణంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో కార్మిక సంఘాల అనుబంధ కార్యాలయాల వద్ద ఏఐటీయూసీ పతాకాలను ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యుడు గుంటూరు ఏడు కొండలు, పొన్నూరు కార్యదర్శి జంపని గోవిందరాజు, సత్యనారాయణ, రత్నబాబు, బండారు రామారావు, గుమ్మడి రోశయ్య, శివాజి, పాండురంగారావు, ఎం శ్రీను, చిరంజీవి, రాఘవయ్య, వెంకటేశ్వర్లు, భరత్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

పాల రైతుల కుటుంబాలకు డీవీసీ అభయ భరోసా

పొన్నూరు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాల రైతుల కుటుంబాలకు ఆర్థిక భరోసాను అందించటమే లక్ష్యంగా డీవీసీ అభయ పథకం అమలు చేస్తునట్లు సంగం డెయిరీ పాలకవర్గ సభ్యులు బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని ములుకుదురు పాల సొసైటీ పరిధిలోని మృతిచెందిన రైతు కుటుంబానికి శుక్రవారం బీమా నగదు అందచేశారు. గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. డీవీసీ అభయ పథకంలో భాగంగా పాల ఉత్పత్తిదారుల సంక్షేమ పథకం కింద రూ.60వేల ఆర్థిక సహాయాన్ని వెంకటేశ్వరరావు కుమారుడు సత్యనారాయణకు రామారావు తదితరులు అందచేశారు. ఈ సందర్భంగా పాల రైతులకు డీవీసీ అభయ పథకం ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ టి.వీరేంద్ర కుమార్, పాల సొసైటీ కార్యవర్గ సభ్యులు, రైతులు, సంగం సిబ్బంది పాల్గొన్నారు.